175 చోట్ల విషతుల్యం..

తూర్పు,మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్లు విషతుల్యంగా మారిన ట్టు నీటిపారుదలశాఖ రెండేళ్ల కిందటే గుర్తించింది.కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు,మునిసిపాల్టీలు సర్వే చేశాయి. అత్యధికంగా కోనసీమలో కోళ్ల,రొయ్యల వ్యర్థాలు, కడి యం,ద్వారపూడి,అనపర్తి,బిక్కవోలు,సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్లు వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు.ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం,భూగర్భ జలాలు సైతం కలుషితమైనట్టు ఆయాశాఖలు తేల్చాయి. కాలువలు కాలుష్యంగా మారినచోట వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అప్పట్లో ప్రయత్నించారు.కానీ అప్పటి ప్రభుత్వం ప్రచారం కోసం మినహా పైసా కూడా ఇవ్వకపోవడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడ్డాయి.

వచ్చే పుష్కరాలకు..



ఒకటే ఘాట్!

పుష్కర ఘాట్ టు కోటిలింగాల ఘాట్

- ఘాట్లు అనుసంధానించే యోచన
- 2 కి.మీ ఏక ఘాట్‌కు సన్నాహాలు
- గత పుష్కర అనుభవాలే కారణం
- ప్రతిపాదన దశకూ చేరని ఫైల్
- కొవ్వూరు వైపు కానరాని అభివృద్ధి
- ఇక అధికారులు దృష్టి పెట్టాల్సిందే

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పవిత్రగోదావరి పుష్కరాలు 2027లో రాజమహేంద్రవరం కేంద్రంగా జరుగబోతున్నాయి. వాటికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది.ఈ మేరకు ఇప్పటికే రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో కలెక్టర్ ప్రశాంతి ఒక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పుష్కరాల అభివృద్ధి పనులు, రేవులకు ప్రధాన రహదారుల అనుసంధానం తదితర అంశాలపై చర్చించారు. అయితే ఈసారి గోదావరి పుష్కరాలకు స్నానాల ఘాట్ల అనుసంధానం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారు. గత పుష్కరాలకు రాజమహేంద్రవరం వచ్చిన ప్రతి భక్తుడు పుష్కరాలరేవులోనే స్నానం చేయాలనే తపనతో పెద్ద ఎత్తున పుష్కరాల రేవుకు రావడంతో ప్రమాదం జరిగిన ఘటన విధితమే. ఈ సారి మాత్రం అటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి రేవు పుష్కరాలరేవే అనే నమ్మకం భక్తుల్లో కల్పించేందుకు ఘాట్ల అను సంధాన ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు.

2 కి.మీ మేర ఒకటే రేవు..

రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవు, కోటిలింగాల రేవులను కలుపుతూ ఒక అతిపెద్ద స్నానాల రేవులను నిర్మించాలనే ఆలోచన అధికార యంత్రాంగం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉన్నారు. ఈ రెండు రేవులు అనుసంధానం చేస్తే సుమారుగా రేవు పొడవు 2 కి.మీ ఉంటుంది. గతంలో అప్పటి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కోటిలింగాల రేవు నుంచి చింతాలమ్మఘాట్ ,పద్మావతి ఘాట్లను కలిపి పెద్దఘాట్‌గా నిర్మించారు. ఇప్పుడు ఆదిరెడ్డి వాసు కోటిలింగాలఘాట్ నుంచి పుష్కరాల రేవు వరకు అనుసంధానం చేసి అతిపొడవైన ఘాట్‌ను నిర్మించతలపెట్టినట్టు తెలిసింది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంది. పుష్కరాలరేవుపై పడే భారీ రద్దీని తగ్గించే యోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గోదావరి గట్టుపై కనకదుర్గమ్మ ఆలయం, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక నుంచి నల్లా చానల్ గ్యాప్ నుంచి శేషయ్యమెట్ట సరిహద్దులు, జలవనరుల శాఖ భవనం, లాహాస్పిన్ హోటల్ వెనుక, రియలన్స్ స్మార్ట్ షాపింగ్ మాల్ వెనుక భాగం గుండా ఈ పుష్కరాల రేవుకు ఘాట్‌ను అసందానం చేస్తారు. స్నానాల రేవులు ఆధునీకరించే పనులు 2027 పుష్కరాల నాటికి పూర్తి చేసే విధంగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర నుంచి తొలి దఫాగా రూ100 కోట్లు నిధులు కేటాయించారు. ఇంకా నిధులు తీసుకు వచ్చే పనిలో కూటమి ప్రజాప్రతినిధులు నిమగ్నమయ్యారు.2025 జనవరి నుంచి పుష్కర పనులు ఆరంభమయ్యే ఆవకాశాలున్నాయి.

కొవ్వూరు వైపు చూడాలి..

రాజమహేంద్రవరంలో పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా కొవ్వూరు రేవును విస్తరించాల్సి ఉంది. ఇప్పటికి గోష్పాదక్షేత్రం రేవునే స్నానాలకు వినియోగిస్తారు. ఆ రేవు విస్తీర్ణం కూడా పెంచితే భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. కొవ్వూరు వైపు రేవుల విస్తీర్ణం పెంచడానికి పెద్ద ఇబ్బందికరమైన పరిస్థితులు ఉండవు. అధికారులు ఆ దిశగా కూడా ఆలోచిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



గోదారంతా.. గరళమే!

ఈ వ్యర్థం.. అనర్థమే : కాలువలను కలుషితం చేస్తున్న వ్యర్థాలు

ఒకనాడు గోదావరి కాలువల్లో నీటిని చేతితో ఒడిసిపట్టి తాగేవాళ్లం.. ఇప్పుడు ఆ నీరు తాగాలంటేనే భయమేస్తోంది.. ఇదీ ఒక 70 ఏళ్ల పెద్దాయన మాట.. మేం గతంలో గోదావరి కాలువల నీటినే బిందెలతో తెచ్చుకుని తాగేవాళ్లం.. ఇప్పుడు నీటిని కొనుక్కుని తాగుతున్నాం.. ఇదీ 60 ఏళ్ల బామ్మ మాట..ఎందుకంటే నాటికి నేటికి గోదావరి కాలువల నిర్వహణలో ఎంతో తేడా ఉంది.. ప్రస్తుతం కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి.. నీళ్లు తాగడం కాదు.. స్నానం చేయడానికే భయపడేంతగా నీళ్లు కలుషితమయ్యాయి.. రెండేళ్ల కిందట ఈ విషయం గుర్తించినా గత వైసీపీ ప్రభుత్వం మాటలు తప్ప.. అలాగే వదిలేసింది.. ఈ విషయం తెలియని ప్రజలు ఆ నీటినే తాగి రోగాల బారినపడ్డారు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్లీన్ గోదావరిపై దృష్టి సారించాల్సి ఉంది.. లేదంటే మరింత ప్రమాదం ముంచుకొస్తుంది..!

175 ప్రాంతాల్లో కాలువలు కలుషితం

- రెండేళ్ల కిందటే అధికారుల నివేదిక
- నాటి సీఎం రూ.100 కోట్ల హామీ
- రూపాయి కూడా విదల్చని వైనం
- కాలుష్య రహితం చేస్తామని గొప్పలు
- అటకెక్కిన 'మిషన్ క్లీన్ గోదావరి'
- ఉమ్మడి జిల్లాలకు కలుషిత నీళ్లు
- వేలాది మందికి ఈ నీళ్లే దిక్కు
- నేటికీ మారని తీరు
- ఎక్కడికక్కడ యథేచ్ఛగా వ్యర్థాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు అటకెక్కిపోయింది. నాలుగేళ్ల నుంచీ పనుల్లో అతీగతీలేక ఎక్కడిదక్కడే అన్నట్టు ఆగిపోయింది.ఉమ్మడి జిల్లాలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయిన నేపథ్యంలో వాటిని శుద్ధి చేస్తామని ప్రకటించి గత వైసీపీ సర్కారు గాలికొదిలేసింది.ఈ నీటిని శుద్ధి చేశాకే పంట కాలువల్లోకి నీరు వదులుతామని ప్రగల్భాలు పలికింది. ఈ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు గొప్పలు చెప్పిన అప్పటి సీఎం జగన్ తీరా నిధుల మంజూరును కాగితాలకే పరిమితం చేశారు.కానీ క్షేత్రస్థాయిలో గత నాలుగేళ్లగా కనీసం పట్టించుకోకపోవడంతో కాలువలు దయనీయంగా మారాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో 175 చోట్ల గోదావరి కాలువల వద్ద కాలుష్యం తీవ్రంగా ఉందని గుర్తించారు. కూటమి ప్రభుత్వం కాలువల బాగుపై దృష్టిసారించాలని అన్నదాతలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన మిషన్ క్లీన్ గోదావరి కార్యాలయం ఇప్పటికీ కొనసాగుతున్న నేపథ్యంలో కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని అటు జలవనరులశాఖ భావిస్తోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

ఎక్కడికక్కడ భయానకం...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు,మధ్యడెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ,తూర్పుడెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్ల లక్షల ఎకరాల సాగు,తాగునీటికి ఆధారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. వీటి వెంబడి ఉన్న వందలాది గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. గృహనిర్మాణ వ్యర్థాలు,చికెన్, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వ్యర్థాలను కాలువల్లో వదిలేస్తున్నారు. కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలు ఉన్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు కలిపేస్తు న్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు.ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నా బయటకు తెలియడం లేదు. పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. ఇదంతా ఒకెత్తయితే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో అనేక రకాల పరిశ్రమలున్నాయి.వీటిలో కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి.కానీ ఖర్చుసాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. రాజమహేంద్రవరంలో మురుగునీటిని నల్లా ఛానల్ ద్వారా గోదావరిలో కలిపేస్తారు. కలుషితం అని తెలిసినా ఈ నీటినే ఓ మోస్తరు శుద్ధిచేసి పంచాయతీలు,మునిసిపాలిటీలు,కార్పొరేషన్లు ప్రజలకు తాగునీటిగాసరఫరా చేస్తున్నాయి.

నాడు గాలికొదిలేసిన వైసీపీ

గత వైసీపీ సర్కారు మిషన్ క్లీన్ గోదావరి పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది.సీఎం చైర్మన్‌గా ఉండే ఈ బోర్డు ద్వారా జిల్లాలో గోదావరి కాలువలను శుద్ధి చేసి,ఆ తర్వాతే నీటిని కాలువల్లోకి వదులుతామని.. రూ.100 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్టు అప్పటి సీఎం జగన్ పలు సమీక్షల్లో గొప్పగా ప్రకటించారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలువల వద్ద ఎక్కడెక్కడ పరిస్థితి తీవ్రంగా ఉందో అధ్యయనం చేశారు. తీరా నిధులు అవసరమైన తరుణంలో అప్పటి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా నిధులు మంజూరు చేయలేదు. కేవలం నిధులిస్తున్నట్టు కాగితాలపై ఆదేశాలు జారీచేశారు. ఇలా మొన్న దిగిపోయే వరకు వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై మాటలు తప్పించి పనులు జరిగేలా కనీస శ్రద్ధ చూప లేదు. దీంతో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు పూర్తిగా అటకెక్కినట్లయ్యింది. గత ఐదేళ్లలో గోదావరి కాలువల నిర్వహణను జగన్ సర్కారు గాలికివదిలేసింది.అటు పూడిక పెరగడం, మరో పక్క కాలుష్య తీవ్రత మరింత పెరిగి ప్రస్తుతం అత్యంత హానికరంగా తయారయ్యాయి.


ఇంత దారుణమా : కాలువ ఒడ్డున వేసిన చెత్త

కూటమి..పట్టాలెక్కించాలి..

కూటమి ప్రభుత్వం గోదావరి కాలువలపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టుకు ఇటీవల ఓ ఐఏఎస్‌ను కూడా సర్కారు నియమించింది.దీంతో ఎంతో కొంత నిధులు, లేదా కంపెనీల సీఎస్ఆర్ నిధుల సాయంతో కాలువల ప్రక్షాళన చేయాల్సి ఉంది.ఇదే విషయమై జలవన రుల శాఖ సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టుకు గత ప్రభుత్వం పైసా కూడా ఇవ్వని నేపథ్యంలో ఏం చేయలేకపోయామని దీంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగిందని వివరించింది.కూటమి ప్రభుత్వం గోదావరి కాలువల్లో కాలుష్యాన్ని నివారించే ప్రాజెక్టును పట్టాలెక్కి స్తుందని ఆయాశాఖల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

మిడ్‌డే మీల్స్ పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం అమలులో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి సూచించారు. బొమ్మూరు జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందజేసే మధ్యాహ్న పథకం వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట డీఈవో వాసుదేవరావు వున్నారు.

నాలుగు కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

రాజమహేంద్రవరంసిటీ,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో మరొక నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను కూటమి ప్రభుత్వం ప్రకటించింది.యాదవ, గౌడ, మాల, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్లకు 15 మంది చొప్పున సభ్యులను ప్రకటించారు. యాదవ కార్పొరేషన్‌కు రాజానగం నుంచి టీడీపీ నాయకుడు బత్తుల నాగేశ్వర రావు,గౌడ కార్పొరేషన్ నిడదవోలు నుంచి టీడీపీ నాయకుడు సూర్యారావు వెలగన, ఉండ్రాజవరం నుంచి జనసేన నాయకురాలు వీరమల్లు వరలక్ష్మి, రాజమహేంద్రవరం రూరల్ కొంత మూరు నుంచి జనసేన నాయకుడు యామన నారాయణ గౌడ్, రాజమహేంద్రవరం రూరల్ నుంచి మద్దా మణికి మాల కార్పొరేషన్ సభ్యులుగా అవకాశం లభించింది.

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా కాల్వలు : నల్లమిల్లి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధవళేశ్వరం బ్యారేజి దిగువన ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రధాన కాలువలు మురుగునీటి డ్రెయిన్ల కన్నా అధ్వానంగా ఉన్నాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంగళవారం గోదావరి కాలు వల ఆధునికీకరణపై మాట్లాడారు. గోదా వరి డెల్టా కాలువల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. రానున్న వేసవి సీజన్‌లో కాలువల్లో పూడిక తొలగించే చర్యలు చేపట్టాలన్నారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనపర్తి,రాజానగరం నియోజక వర్గాల్లో చాగల్నాడు, వెంకటాపు రం,పుష్కర పథకాల్లోని భూములు డి పట్టాలు అందడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తూర్పుగో దావరి డెల్టాలో మెయిన్ కెనాల్స్ 14, ప్రధాన కాలువలు 20, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మెయిన్ కెనాల్స్ 11,ప్రధాన కాలు వలు 21 ఉన్నాయని అంతే కాకుండా మురుగు నీరు పోయేందుకు మరికొన్ని కాలువలు ఉన్నాయని వాటిని పునరుద్ధరించాలన్నారు.

ఉచిత ఇసుకకు అడ్డంకులు సృష్టిస్తే చర్యలు : జేసీ


బల్లిపాడు రీచ్‌లో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

తాళ్లపూడి, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : ఉచిత ఇసుకకు అడ్డంకులు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ చిన్నరాముడు హెచ్చరించారు. తాళ్లపూడి మండలం బల్లిపాడు రీచ్‌లో ఇసుక తవ్వకాలు, రవాణా మంగళవారం పరిశీలించి మాట్లాడారు. వీఆర్‌వోల వద్ద అనుమతులు తీసుకుని ఓపెన్ ర్యాంపుల నుంచి ప్రజలకు అవసరమైన ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టరు ద్వారా ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు. బల్లిపాడు, చిడిపి రీచ్‌లలో ఇసుక తవ్వి స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు గుత్తేదారులు ఎంపిక య్యారన్నారు.బల్లిపాడుకు చెందిన కూటమి నాయకులు శంకరం జగదీష్, రమేష్ మాట్లాడుతూ గుత్తేదారులు ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలిస్తూనే బయటకు విక్రయిస్తున్నారన్నారు. అక్కడ అధికారుల పర్యవేక్షణ ఉండాలని జేసీకి ఫిర్యాదు చేశారు.ఆయన వెంట ఆర్‌డీవో రాణీ సుస్మిత, డీటీ భారతి ఉన్నారు.


ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద రోడ్డుపై బైఠాయించి కార్మికుల నిరసన

ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ మాఫియాకు అడ్డాగా తయారైందని.. కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందజేయడంలేదని, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. సీతంపేట ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట మంగళవారం సీపీఐ, రాజమహేంద్రవరం జట్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రజాప్రతినిధులు ఈఎస్ఐ ఆసుపత్రిపై దృష్టి పెట్టాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎంపీ పురందేశ్వరి ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించి మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, సప్పా రమణ, భద్రరావు, రామకృష్ణ, రమణ, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులు చింతలపూడి సునీల్, కె.శ్రీనివాస్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

ప్రజారోగ్యానికి పాటుపడండి

ఆరోగ్య సహాయకుల శిక్షణలో డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 : గ్రామాల్లో ప్రజారోగ్యం కోసం కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఆరోగ్య సహాయకులకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చర్యలపై శిక్షణలో తెలియజేస్తారన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామీణ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా మలేరియా ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ జే.సంధ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సహాయకులు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ ఐ.రామకృష్ణారావు,నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో నాగు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు

- 1 నుంచి తనిఖీలు చేస్తాం
- ఏఎస్‌వో నాగాంజనేయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి జిల్లా వ్యా ప్తంగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు తెలిపారు. 'రేషన్ బియ్యం పక్కదారి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 16వ తేదీన ప్రచురితమైన కథనంపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. నిడదవోలు మండలం సూరాపురంలో మంగళవారం కొన్ని ఇళ్ళు, కోళ్ళ ఫారంలను ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదే శాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అనుమా నితులను హెచ్చరించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న కోళ్ల ఫారంలలో కూడా తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో ఎ.సత్యనారా యణ, ఎస్ఎస్.సుధీర్ రెడ్డి, సివిల్ సప్లయిస్ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


సూరాపురంలో సివిల్ సప్లయిస్ అధికారుల తనిఖీ

మాజీ ఎంపీ కేపీస్సార్ తనయుడే
కాగ్ చీఫ్
కోనసీమ, కాకినాడతోనూ సంబంధాలు
- 6లో



పిల్లలకూ ఉంది.. రాజ్యాంగం

రేపటి పౌరుల పరిరక్షణ దేశానికి రక్షణ

పిల్లలకు బాధ్యతలూ నేర్పడమూ పెద్దల బాధ్యతే

నేడు బాలల హక్కుల సంరక్షణ దినం

రాజమహేంద్రవరం/కార్పొరేషన్(కాకినాడ), నవంబరు19(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని అంటారు. అది అక్షర సత్యమే. ఆ బాలల హక్కులను కాపాడుతూ, బాధ్యతలను అలవర్చినప్పుడే మంచి సమాజం తద్వారా మెరుగైన దేశాన్ని చూడవచ్చు. బాలలకు ప్రత్యేక హక్కులు సంక్రమించి మూడు దశాబ్దాలు దాటినా వాటి అమలు వెనుకబడిపోయింది. బడిలో ఉండాల్సిన బాల్యం దుకాణాల్లో బండెడు చాకిరీ చేస్తోంది. సిగ్నళ్ల వద్ద చిన్నారులు యాచించడం వ్యవస్థల అలసత్వాన్ని వెక్కిరిస్తోంది. అక్షరాలు దిద్దాల్సిన వయసు వెట్టిచాకిరీల్లో మగ్గిపోతోంది. బాల్యవివాహాల్లో చిన్నారి వధువులు సమిధలుగా మారిపోతున్నారు. నేడు బాలల హక్కుల పరిరక్షణ దినోత్సం సందర్భంగా జాతి సంపద హక్కులపై కథనం..

బాలలకు ప్రత్యేక హక్కులు

ప్రపంచవ్యాప్తంగా పిల్లల సంక్షేమాన్ని సంరక్షించడానికి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1959 నవంబరు 20న బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. అందువల్ల ఆ రోజున బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పెద్దవాళ్లకు ఉండే హక్కులన్నీ పిల్లలకూ రాజ్యాంగం అందించింది. రేపటి పౌరుల కోసం ఐక్యరాజ్య సమితి 1989లో దేశాల నడుమ ఒడంబడిక ద్వారా బాలలకు ప్రత్యేక హక్కులను ఇచ్చింది. మన దేశం వాటిని 1992లో ఆమోదించి ఒడంబడికపై సంతకం చేసింది. అప్పటి నుంచీ బాలల హక్కులు సంరక్షించడానికి, అమలుచేయడానికి వివిధ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. బాలల హక్కుల ఒడంబడికలో 1 నుంచి 41 వరకూ బాలలకు సంబంధించిన అంశాలు, 42 నుంచి 46 వరకూ వాటిని అమలు చేసే విధానాలు, 47 నుంచి 54 వరకూ అంతర్జాతీయ ప్రమాణాలు, బాధ్యతల గురించి వివరించారు. వీటి ప్రకారం 18ఏళ్లలోపు వయసు వారందరినీ బాలలుగానే పరిగణిస్తారు. బాలల హక్కులను నాలుగు మూల సూత్రాల ఆధారంగా రూపొందించారు. వివక్షతకు తావు ఉండకుండా బాలల అభిప్రాయాలకు అత్యున్నత ప్రాధాన్యమివ్వాలని, వారికి జీవించే హక్కును కల్పించడంతోపాటు భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కును అందించాలనే మూల స్తంభాల మీద బాలల హక్కుల ఒడంబడిక కుదిరింది. మొత్తం హక్కులను జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే, భాగస్వామ్యం పొందే హక్కులుగా విభజించారు.

కాకినాడ జిల్లాలో...

బాలల హక్కుల కోసం కాకినాడ జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 2024లో 250 పాఠశాలలు, 30 కళాశాలల్లో అవగాహన తరగతులు, 36 బాల్యవివాహాలు నిలుపుదల, భిక్షాటన చేసే 35 పిల్లలను రెస్క్యూ చేసి 14మందిని తల్లిదండ్రులకు అప్పగించి 21మందిని పాఠశాలల్లో చేర్పడం జరిగింది. గత సంవత్సరాల్లో ఫోక్సో బాధిత బాలికలకు ఈ ఏడాది 75 మందికి పరిహారం ఇచ్చారు. అనాధలుగా నిరాదరణకు లోనైన 410 మంది బాలలకు స్పాన్సర్‌షిప్ అమౌంట్ ఇచ్చారు. అనాధలుగా వదిలివేసిన 11మంది బాలలకు టీఏఆర్ఏ ద్వారా దత్తత ప్రక్రియ పూర్తి చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



సమాజంలో ప్రతి ఒక్కరూ బాలలపై లైంగిక వేధింపులను వ్యతిరేకించాలి. ఎక్కడైనా బాలల ను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించకూడదు. ఎవరైనా ఎటువంటి ఆపదలో ఉన్నా, టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారమివ్వాలి. ప్రభుత్వపరంగా సమాజంలో బాలల హక్కుల పరిరక్షణకు మా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చిన్నారి రక్షణ, కిశోర వికాసం వంటి కార్యక్రమాలు నిర్వహణతోపాటు వారి రక్షణ, పరిరక్షణకు ఎంతగానో కృషి చేస్తున్నాం.

- కొండా ప్రవీణ, కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పీడీ



సోషల్ మీడియాలో వికృత క్రీడ!

- గీత దాటితే తప్పవు కేసులు, జైలు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఎసరే
- తునిలో డిజిటల్ మీడియాలో అభ్యంతరకర, అసభ్య పోస్టులు పెడుతున్న 17 మంది అరెస్టు

తునిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. రాజకీయ ప్రచారానికి వినియోగించడంతోపాటు ప్రత్యర్థులు, వారి కుటుంబీకులు, ఆ కుటుంబాల మహిళలు, చిన్నపిల్లలపై బూతులతో విరుచుకుపడుతున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. మార్ఫింగ్ ఫొటోలతో తమ పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ ఇష్టమైన నేతల కళ్లల్లో ఆనందం కోసం వికృత చేష్టలతో ఇతరులను తూలనాడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. వీరిలో విద్యాధికులే అధికంగా ఉండడం, అందులోని ఎక్కువశాతం యువకులు ఉండడం ఆందోళన కలిగించే అంశం. సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా సైకోలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించింది. తునిలో వైసీపీ సానుభూతిపరులు తమ నేత కళ్లల్లో ఆనందం చూడడం కోసం సోషల్ మీడియా వేదికపై వికృత చేష్టలకు పాల్పడుతూ పెద్దసంఖ్యలో పోలీసులు పట్టుపడుతున్నారు. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఫేక్ అకౌంట్లతో రాజకీయ నాయకులు, వారి కుటుంబీకులపై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడుతున్న వారిపై వారిని గురించి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. తీగ లాగితే డొంక కదిలిందన్న చందాన వీరి సోషల్ మీడియా అకౌంట్‌లకు తుని నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి సంబంధాలు ఉండడంతో పోలీసులు మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా పోలీసులు యువతను చైతన్యపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో గీత దాటితే వేటు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువత అప్రమత్తం అవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఫేక్, మార్ఫింగ్ పోస్టింగ్‌లు పెడితే..

ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు పెడితే అవతల వారి వ్యక్తిత్వాన్ని అవమానిస్తే డీఎన్ఎస్ 67 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువు అయితే 3 ఏళ్ల జైలుశిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తారు.

● అసభ్యకర పోస్టులు పెడితే..

67ఏ సెక్షన్ కింద కేసు నమోదవుతుంది. 5 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఇంకా...

- ప్రముఖ వ్యక్తుల పేరుతో అసభ్యకర పోస్టులు పెడితే 66(డి)సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తారు. 3 ఏళ్ళు జైలుశిక్ష, రూ.1 లక్ష వరకు జరిమానా విధిస్తారు.
- తప్పుడు పత్రాలు సృష్టించి ఒక వ్యక్తి పరువుకుభంగం కలిగిస్తే బీఎన్ఎస్ చట్టంలోని 336(4)సెక్షన్ కింద కేసు పెడతారు.
- సంఘంలోని సమూహాలు, సంఘాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే బీఎన్ఎస్ చట్టంలోని 362(2)సెక్షన్‌తోపాటు పరువు నష్టం కింద కేసు నమోదవుతుంది.
- జుగుప్సాకరంగా ఉన్న చిత్రాలు, ఫొటోలు పోస్ట్ చేస్తే ఎలక్ట్రానిక్ ఆధారాలుగా పరిగణించి బీఎన్ఎస్ చట్టంలోని 353(2)కింద కేసు తప్పదు.

● ఈ కేసుల్లో ఇరుకుంటే..

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారిలో యువత, విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారు. ఈ కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగ నియామక సమయంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఉద్యోగాల నియామకాల సమయంలో పోలీస్‌శాఖ నిరంభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ)పత్రం జారీచేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తే వారిపై కేసు నమోదై ఉంటే వారికి ఎన్‌ఓసీ జారీచేయరు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాలకు వెళ్లేవారికి పాస్‌పోర్టు జారీ సమయంలో ఇబ్బంది తప్పదు. కేసులు నమోదై ఉంటే పోలీసుల తనిఖీ సమయంలో తోసిపుచ్చుతారు. కొందరు ఈపాటికే విదేశాల్లో ఉండి అక్కడ నుంచి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర మార్ఫింగ్ ఫోటోలతో పోస్టులు పెడుతున్నారు. తాము దూరం ప్రాంతంలో ఉన్నామనే భ్రమలో రెచ్చిపోతున్నారు. అటువంటి వారిపై కేసు నమోదైతే లుక్‌అవుట్ జారీచేస్తారు. దేశంలో ఎప్పుడైనా అడుగుపెడితే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు.

● పరిశీలనలో ప్రతి ఖాతా : సీఐ

సామాజిక మధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినా అసభ్యకర పదజాలంతో రెచ్చిపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు చెప్పారు. సైబర్ క్రైం, సామాజిక మాధ్యమాలపై సైబర్ సెల్ విభాగం పూర్తిగా నిఘా పెట్టిందని, రోత పోస్టులు పెడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



తునిలో మీడియాతో మాట్లాడుతున్న తుని పట్టణ, రూరల్ సీఐలు చెన్నకేశవరావు, గీతారామకృష్ణ

తునిలో 17 మంది అరెస్టు.. రిమాండ్

తుని రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి డిజిటల్ సోషల్ మీడియా వేదికల్లో ప్రభుత్వంపైనా, ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలకు వ్యతిరేకంగా వైసీపీకి లబ్ధి చేకూర్చేలా ప్రచారం చేస్తూ రాజకీయ అనిచ్ఛితిను ప్రేరేపించేందుకు పాల్పడుతున్న వారిపై కాకినాడ జిల్లా తుని పట్టణ, గ్రామీణ పోలీసులు కొరఢా ఝుళిపించారు. సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారానికి పాల్పడుతున్న 17 మందిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి పలువురిని రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నాగం గంగబాబు, అడపా సురేష్, గణేశుల వీరబాబు, చింతకాయల చినబాబు, బంగారు బ్రహ్మానాయుడు, యలమంచిలి మణికంఠ, చింతమనీడి గణేష్, కాకినాడ నానితోపాటు తుని మునిసిపల్ కౌన్సిలర్ షేక్ క్వాజా మెహిద్దీన్, ఏలూరి బాలు, వెలుగొండి జార్జ్ కిరణ్, ఇసరపు సాయి, మొగసాల నాగ రామశ్రీను, ఇబ్బ శ్రీను, పెంటకోట వెంకటరమణ, కోరుమిల్లి లలితపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతుందని, విచారణ అనంతరం ఇందులో ఇంకా ఎవరి భాగస్వామ్యమైనా ఉంటే అరెస్టు చేస్తామన్నారు. యువత సోషల్ మీడియాలో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనం అవుతుందని ఆయన హెచ్చరించారు.





పి.మల్లవరంలో వరిచేలో బర్మాబ్లాక్ వరి సాగు.. రైతు రమణ

ఈ రైతు రూటే సెపరేటు

ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శ రైతు

బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్, మైసూర్ మల్లిగా రకాలతో వరి సాగు

తాళ్లరేవు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులతో పనిలేకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను సాధించే దిశగా కొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం బాటపడుతున్నారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయ సేద్యం వైపు మళ్లేలా రైతు దూళిపూడి వెంకట రమణ అనే రైతు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామంలో 50 సెంట్ల వరిపొలంలో ప్రకృతి వ్యవసాయ సాగును ప్రాజెక్టుగా తీసుకుని జీవామృతం, కషాయాలతో వ్యవసాయ సాగుచేశారు. 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆకుమడి దమ్ముకి రూ.1500, 7 కిలోలను ఆకుమడి విత్తనాలు చల్లారు. దీనికి కిలో రూ.140 చొప్పున 7 కిలోల ఖర్చు రూ.980 అయింది. అలాగే గట్టులంకలకు రూ.1200, వరినాట్లు వేయడానికి రూ.2000, రెండుసార్లు కసాయింలను పిచికారి చేయడానికి రూ.1200 ఖర్చయ్యిందంటున్నారు. ప్రస్తుతం బర్మా బ్లాక్ వరి రకాన్ని మాత్రమే సాగుచేశానని, మణిపూర్ బ్లాక్, మైసూర్ మల్లిగా వరి రకాలను సాగు కోసం సిద్ధం చేసుకున్నట్టు రైతు వెంకట రమణ తెలిపారు. పంట బాగుందని, ఎలాంటి చీడపీడలతో నష్టం జరగలేదని ఆయన చెప్పారు.

ఈ బియ్యంతో ప్రయోజనాలెన్నో..

బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్ వంటి విత్తనాలు.. నలుపు రంగులో ఉంటాయి. అధిక యాంటీ ఆక్సిడెంట్ కంటెంట్ కలిగినవి. ఈ బియ్యం వల్ల కలిగే కేన్సర్, డయాబెటిస్, గుండె జబ్బులు వంటి అనారోగ్యాల బారిన నుంచి రక్షణ కల్పిస్తుంది. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను సైతం తగ్గిస్తుంది. ఈ బియ్యంలో విటమిన్ బి, ఇ, నియాసిన్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింకు వంటి ఖనిజ విలువలు, పీచు పదార్థాలు అధికం. ఈ బియ్యంలో ఆంకోసైనిన్స్, యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేయడమేగాక రోగనిరోధక ఎంజైములను క్రియాశీలకం చేస్తుందని చెబుతున్నారు.

మైసూర్ మల్లిగా..

మైసూర్ మల్లిగా రకం సంప్రదాయ రకాల్లో ఒకటి. బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. ఎదిగే పిల్లలకు అవసరమైన అధిక పోషకాలు, ప్రొటీన్స్ లభించే గుణం కలిగి ఉంది. పిల్లలకు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. పిల్లలకు ఈ బియ్యంతో ఆరోగ్య సంబంధమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం సాగులో ఈ రకాన్ని ఎక్కువ పండిస్తున్నారు.



స్టాంపులకు.. ఆధారమే!

కూటమి సర్కారు నూతన విధానం

- తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- అక్రమాల నియంత్రణే లక్ష్యం
- నకిలీలకు అడ్డుకట్ట
- కృత్రిమ కొరతకు చెక్

పెద్దాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడీషియల్ స్టాంపు అమ్మకాలు తీరును సంస్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల అమ్మకాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది.గత వైసీపీ ప్రభుత్వం ఈ స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టి ప్రజల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం నాన్ జుడీషియల్ స్టాంపుల వైపే మొగ్గు చూపింది. ఇందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్ద సంఖ్యలో స్టాంపులను తెప్పించి అన్ని జిల్లాలకు సరఫరా చేసింది. నాన్ జుడీషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలు నమోదుచేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తే స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంపు వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. అయితే కొందరు వెండర్లు ఎక్కువ సంఖ్యలో స్టాంపులు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించే వారన్న విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యేవి. నకిలీ స్టాంపులు కొన్ని చోట్ల బహిర్గతమైన సందర్భాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది.ఇందుకు అనుగుణంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఆధార్ తప్పనిసరి ..

ఒకటి, అంతకన్నా ఎక్కువగా నాన్ జుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేసినా కొత్త విధా నంలో మొత్తం వివరాలు కంప్యూటర్‌లో నమో దు చేసుకోవాల్సిందే. స్టాంపులు పొందడానికి ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆధార్ నెంబరును కంప్యూటర్‌లో నమోదు చేయాలి. వివరాల నమోదు తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంపులు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి 10 స్టాంపులు వరకూ కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నెంబర్ నమోదు చేయడం వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది.

లెక్క తెలిసిపోతుందిలా..

స్టాంపుల విక్రయాల్లో గతంలో మాదిరిగా రికార్డుల్లో రాసి స్టాంపులు ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. రిజిస్టర్లు , అకౌంట్ పుస్తకాలు కలిగి ఉండే స్టాంపు వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏఏ స్టాంపులు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకా శం కలిగింది.ఈ క్రమంలో విక్రయాలు తక్కు వగా జరిగే కార్యాలయాల నుంచి ఎక్కువ వినియోగం ఉండే కార్యాలయాలకు స్టాంపులను తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. కూటమి ప్రభుత్వ ఆలోచనపై హర్షం వ్యక్తమవుతుంది. ఎందుకంటే స్టాంప్‌ల కారణంగా చాలా ఇబ్బందులు ఉంటాయి. ఆధార్ నెంబర్ తప్పనిసరి చేయడంతో ఆ ఇబ్బందులు కొంత వరకూ తగ్గే అవకాశం ఉంటుంది.

అందుబాటులో స్టాంపులు

నాన్ జుడీషియల్ స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నంబర్ నమోదు చేసుకుని స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది.స్టాంపు వెండర్లు నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలి.

- కె.ఆనందరావు, జిల్లా రిజిస్ట్రార్, కాకినాడ



కాకినాడ రేచర్లపేటలోని ఇల్లు.. కాగ్ చీఫ్ సంజయ్‌మూర్తి

కాగ్ చీఫ్ మనోడే

మాజీ ఎంపీ కేఎస్సార్ తనయుడే సంజయ్‌మూర్తి

1996లో ఎంపీగా పనిచేసిన కేఎస్ఆర్.మూర్తి

ఈ ప్రాంత ప్రజలతో సంజయ్‌మూర్తికి సంబంధాలు

అమలాపురం/కాకినాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) చీఫ్‌గా నియమితులైన కె.సంజయ్‌మూర్తికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో సంబంధాలు ఉన్నాయి. గతంలో ఆయన తండ్రి విశ్రాంత ఐఏఎస్ అధికారి కేఎస్సార్ మూర్తి కాంగ్రెస్ పార్టీ నుంచి అమలాపురం లోక్‌సభ రిజర్వుడ్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. ఆ సమయంలో ఆయన తనయుడైన కె.సంజయ్‌మూర్తి పలు సందర్భాల్లో కోనసీమ ప్రాంతంలో పర్యటించారు. ఈ ప్రాంత ముఖ్యులతో పరిచయాలు కలిగి ఉన్నారు. 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కేఎస్సార్ మూర్తి కాంగ్రెస్ పార్టీ నుంచి అమలాపురం ఎంపీ స్థానానికి ఎన్నికయ్యారు. అంతకు పూర్వం నుంచే సీనియర్ ఐఏఎస్ హోదాలో ఈ ప్రాంత ప్రజలతో సంబంధాలు, బంధుత్వాలు కూడా మూర్తికి కలిగి ఉన్నాయి. ఈ జిల్లాలోని ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల ఆలయం నిర్వహణలో కేఎస్సార్ మూర్తి కీలక పాత్ర వహించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఆయన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. తండ్రి అడుగు జాడల్లోనే నడిచే సీనియర్ ఐఏఎస్ అధికారిగా కె.సంజయ్‌మూర్తికి మంచి పేరు ఉంది. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ కేడర్ నుంచి కాగ్‌కు ఎంపికయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము కె.సంజయ్‌మూర్తిని కాగ్ చీఫ్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం సంజయ్‌మూర్తి కేంద్ర విద్యాశాఖలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈనెల 21న సంజయ్ పదవీ బాధ్యతలను చేపట్టనున్నారు. కాకినాడ జిల్లా రేచర్లపేటకు చెందిన కేఎస్సార్ మూర్తి దంపతులకు సంజయ్‌మూర్తి జన్మించారు. ఎంపీగా పనిచేసిన ఆయన తండ్రి కేఎస్సార్ మూర్తికి కోనసీమలో మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలో కోనసీమలో మంచినీటి పథకాల అమలుకు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తుల్లో కేఎస్సార్ మూర్తి ఒకరు. ఈ ప్రాంతంలో అప్పట్లో జరిగిన కార్యక్రమాలకు తనయుడు సంజయ్‌మూర్తి కూడా అప్పుడప్పుడూ హాజరై ప్రజలతో మమేకమయ్యేవారు.

పెరిగింది కాకినాడలోనే..

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా నియమితులైన తొలి తెలుగు వ్యక్తి సంజయ్‌మూర్తిది కాకినాడ కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అత్యున్నత పదవి తొలిసారిగా తెలుగు అధికారికి దక్కడం, అదీ ఆయన కాకినాడ రేచర్లపేటకు చెందిన వారు కావడంతో ఆయన గురించి తెలిసిన వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంజయ్ మూర్తి తండ్రి కోండ్రు శ్రీరామచంద్రమూర్తి 1996లో అమలాపురం ఎంపీగా పనిచేశారు. అంతకు ముందు ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేశారు.ఎంపీగా చేసిన కాలంలో కాకినాడ రేచర్లపేటలోని సొంతింట్లోనే ఉండేవారు. అదే సమయంలో తల్లితో కలిసి కొంతకాలం ఇక్కడే సంజయ్‌మూర్తి ఉన్నారు.తండ్రి ఐఏఎస్ కావడంతో సంజయ్‌మూర్తి చదువంతా ఎక్కువగా హైదరాబాద్‌లోనే గడిచింది.ఆ తర్వాత సంజయ్ 1989లో ఐఏఎస్‌కు ఎంపికవడంతో హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌లో చాలాకాలం పనిచేశారు. పండగ సమయాల్లో మాత్రం కాకినాడ రేచర్లపేటకు వచ్చి కొన్నిరోజులు గడిపేవారు. రేచర్లపేటలోని సొంతింట్లో ప్రస్తుతం సంజయ్ కుటుంబీకులు ఎవరూ లేరు.కొన్నాళ్ల కిందట సంజయ్‌మూర్తి తల్లిదండ్రులు చనిపోవడంతో ఉంటున్న ఇంటిని అద్దెకు ఇచ్చేశారు.



ఎంత మంది పిల్లలున్నా పోటీకి ఓకే!

- స్థానిక సంస్థలకు సంతానం నిబంధన ఎత్తివేత
- చట్ట సవరణ చేస్తూ ప్రభుత్వ నిర్ణయం

పెద్దాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటి వరకూ ఉన్న ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయనున్నారు. ఇకపై ఎంత మంది పిల్లలు ఉన్నా పట్టణ స్థాయి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులుగా ప్రకటించింది.ఈ బిల్లు 2024లోనే అమల్లోకి రానుంది.ఈ మేరకు మునిసిపల్ మంత్రి నారాయణ సభలో సైతం ప్రతిపాదించారు. జనాభా వృద్ధి రేటు పెంపుదలలో భాగంగానే చట్టంలో మార్పులు తెచ్చినట్టు స్పష్టం చేశారు. మునిసిపల్ శాసనాల సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం కూడా తెలిపింది. ఈ మేరకు చట్టానికి సైతం సవరణలు చేయనున్నారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని ఎప్పటి నుంచో వస్తున్న డిమాండ్లకు కూటమి ప్రభుత్వం అమోదం తెలియచేయడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే పట్టణ స్థానిక సంస్థల అభ్యర్థులకు ఏఏ సందర్భాల్లో ఇందులో మినహాయింపులతో కూడిన వెసులుబాటు లభిస్తుందనే విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి వివరణ ఇవ్వాల్సి ఉంది. శాసనమండలి ఆమోదం పొందిన తరువాత జీవో జారీ చేయగానే కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని ప్రకటించారు. గతంలో ఇద్దరు కంటే ఎక్కువ సంతానం ఉన్న వారు పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత లేకుండా ఉండేవారు. కొత్త నిబంధనతో ఎంత మంది పిల్లలు ఉన్నా ఎన్నికల్లో పోటీకి అర్హులే.

ఒక్కటైన ఐఏఎస్‌లు

» విశాఖలో ప్రేమ వివాహం.. బిళ్లకుర్రులో రిసెప్షన్


కొత్తపేట మండలం బిళ్లకుర్రు తరిట్లవారిపేటలో రిసెప్షన్‌లో ఐఏఎస్‌లు

కొత్తపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ఐఏఎస్‌లు.. ప్రేమ వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. కొత్తపేట మండలం బిళ్లకుర్రులో రిసెప్షన్ వేడుక నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలం బిళ్లకుర్రు తరిట్లవారిపేటకు చెందిన తరిట్ల ధర్మారావు మధ్యప్రదేశ్‌లో కలెక్టర్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు తరిట్ల ప్రతీక్‌రావు, హైదరాబాద్‌కు చెందిన కె.అనీషా.. ఇద్దరూ 2023లో ఢిల్లీ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందారు. అప్పటి పరిచయం మేరకు వీరిద్దరూ విశాఖలో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రతీక్‌రావు స్వగ్రామమైన తరిట్లవారిపేటలో మంగళవారం పెద్దల సమక్షంలో రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించగా పలువురు హాజరై ఆశీర్వదించారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం

రూ.1.73 కోట్లు


హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,73,10,259 నగదు, 28.500 గ్రాముల బంగారం, 862 గ్రాముల వెండి లభించింది. వీటితోపాటు యుఎస్‌ఏకు చెందిన 162 డాలర్లు, కెనడా 15 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, ఆస్ట్రేలియా 25 డాలర్లతోపాటు పలు దేశాల విదేశీ కరెన్సీ సమకూరాయి. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 20 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.8.65 లక్షల ఆదాయం హుండీల ద్వారా లభించింది.

వచ్చేనెల 28న క్రియ పిల్లల పండుగ

» కాకినాడ జేఎన్‌టీయూ వేదికగా నిర్వహణ

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు19(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 28, 29 తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో క్రియ పిల్లల పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీనిలో భాగంగా 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు జరగనున్నాయి. విద్యార్థులకు నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, పాటలు, పోస్టర్ ప్రజంటేషన్, కథారచన, చిత్రలేఖనం, బుర్రకథ, జానపదనృత్యం, విచిత్ర వేషధారణ, కథ చెప్పడం, వాద్య సంగీతం వంటి పోటీలు నిర్వహిస్తారు. 400 పాఠశాలల నుంచి 12వేల మంది వరకు విద్యార్థులు వస్తారని అంచనా వేస్తున్నారు. 1నుంచి 5వ తరగతి వరకు సబ్‌జూనియర్ కేటగిరీలో, 6 నుంచి 7వ తరగతి వరకు జూనియర్ కేటగిరీలో, 8 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ కేటగిరీలో పోటీలు జరుగుతాయి. www.kriyaonline.org వెబ్‌సైట్ ద్వారా స్కూల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చును.

సక్రమంగా ఆరుగురి నామినేషన్లు

» కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్‌లు పరిశీలన చేశారు. ఆరుగురు అభ్యర్థులు వేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు. మంగళవారం నామినేషన్లను ఎవరూ ఉపసంహరించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయఎమ్మెల్సీ అభ్యర్థులు బుర్ర గోపీమూర్తి, గంధం నారాయణరావు, నామ వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగుదీపక్, అహ్మద్‌షేక్, డీఆర్‌వో వెంకట్రావు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా...

భీమేశ్వరస్వామి తెప్పోత్సవం

» భక్తుల శివనామస్మరణ మధ్య నిర్వహణ

» హంస వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు

» ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ


భీమేశ్వరస్వామి ఆలయ కోనేరు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కోనేరు పుష్కరిణిలో మంగళవారం రాత్రి భీమేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరి ఉత్సవమూర్తులు నయనానందకరంగా అలంకరించిన హంస వాహనంపై విహరించే కార్యక్రమాన్ని వందలాది భక్తుల శివ నామస్మరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముందుగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి, అమ్మవారి దేవతామూర్తులకు ప్రత్యేక శాంతికర పూజలను నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను అర్చకస్వాములు కోనేరు పుష్కరిణిలో విద్యుద్దీపాలంకరణలతోనూ, పూలతోనూ అలంకరించిన హంస వాహనంపై ప్రతిష్ఠించి తెప్పోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హంస వాహనంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, రైతుసంఘ అధ్యక్షులు కంటే జగదీష్‌మోహనరావు(బాబు), సీఐ శ్రీకృష్ణ భగవాన్, అర్చకస్వాములు ఆశీనులు కాగా కోనేరు పుష్కరిణిలో స్వామివారు, అమ్మవారు హంస వాహనంపై మూడు ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ తదితర భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



అంతర కళాశాలల కబడ్డీలో జేఎన్టీయూకే జట్టుకు తృతీయస్థానం


కబడ్డీ జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

జేఎన్టీయూకే, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16, 17 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులోని రైస్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో నిర్వహించిన జేఎన్టీయూకే అంతర కళాశాలల కబడ్డీ మహిళల పోటీల్లో జేఎన్టీయూకే జట్టు తృతీయస్థానంలో నిలిచినట్టు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో 20 కళాశాలల జట్లు పాల్గొన్నాయన్నారు. ప్రతిభ కనబరచి తృతీయస్థానంలో నిలిచిన జట్టు క్రీడాకారిణులను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, శ్యామ్‌కుమార్ అభినందించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

» ఇద్దరికి తీవ్రగాయాలు

» మండపేటలో ఘటన


మండపేటలో కారు ఢీకొట్టడంతో తిరగబడిపోయిన బైక్

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం కలవపువ్వుసెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలివి. మండపేట పట్టణానికి చెందిన వసంత టైలర్స్ యజమాని కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న సమయంలో అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో మండపేట పట్టణంలోని గాంధీనగరానికి చెందిన ఎం.పద్దయ్య, గొల్లపుంతకాలనీకి చెందిన రెడ్డి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మండపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

» 14 వరకూ ప్రత్యేక పూజలు


పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులు

పిఠాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో డిసెంబరు 8 నుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. 14 వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దత్త జయంతి మహోత్సవాల తొలిరోజు 8వతేదీ నుంచి 14వరకూ ప్రతిరోజూ మహాగణపతిపూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మాలకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేద పారాయణ, రుత్విక్కులతో మూలమంత్ర అనుష్ఠానం, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం 4 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, 5గంటలకు శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాదపద్మాలకు వివిధ హారతులు, స్వామి వారికి పల్లకిసేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుగుతాయి. 8వతేదీ ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదేరోజు సర్వపుష్పపూజ, 9న లక్షబిల్వార్చన, 10న సహస్ర చామంతి పూజ, 11న లక్షతులసి అర్చన, 12న సహస్ర లిల్లీ పుష్పపూజ, 13న గులాబి అర్చన, సంపెంగ పుష్పపూజ, 14న పూలంగిసేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్తజయంతిరోజు సాయంత్రం దత్తాత్రేయ స్వామిరథోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మహాసంస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

స్కేటింగ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు పాశర్లపూడి కుర్రోడు


మిత్ర ఆరుష్

మామిడికుదురు,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కేటింగ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామానికి చెందిన మార్గపూడి మిత్ర ఆరుష్ ఎంపికయ్యాడు. గతనెలలో హైదరాబాద్‌లో జరిగిన స్కేటింగ్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆరుష్ ప్రతిభ కనబరిచి ప్రపంచకప్‌కు ఎంపికైనట్టు అతడి తండ్రి శ్రీనివాసరావు తెలిపారు. ఫుట్‌బాల్‌స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి టర్కీలోని టర్సన్ నగరంలో ఈనెల 20 నుంచి 26 వరకు జరగనున్నట్టు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతోపాటు తన కుమారుడు కూడా ఈ పోటీల్లో పాల్గొనేందుకు టర్కీకి బయలుదేరినట్టు ఆయన తెలిపారు. తమ గ్రామస్థుడు ప్రపంచ పోటీలకు ఎంపికవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

40కిలోల గంజాయి స్వాధీనం

» మోతుగూడెంలో వేర్వేరు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న పోలీసులు

మోతుగూడెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో వేర్వేరు తనిఖీల్లో 40కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీలేరునుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురిని మోతుగూడెం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా గోదిసేలపేటకు చెందిన మద్దెల హరీష్, అలక్క సందీప్, పైడిపల్లికి చెందిన పెరుమాండ్ల ప్రవీణ్, మత్రిపల్లికి చెందిన జుంబిడి విజయ్ సీలేరు నుంచి కరీంనగర్‌కు 30కిలోల గంజాయిని తీసుకెళ్తుండగా సమాచారం రావడంతో పోలీసులు పట్టుకున్నారు. దాని విలువ రూ.1.50లక్షలు ఉంటుంది. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా డొం కరాయి ఎస్‌ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి అంబేడ్కర్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు గ్రామానికి చెందిన కస్నెబోయిన దుర్గాప్రసాద్, తులసిపాక గ్రామానికి చెందిన నమలం మల్లేష్, ఒడిశా రాష్ట్రం కలిమెల నుంచి పది కిలోల గంజాయిని ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తుండగా అరెస్ట్ చేశారు.


గంజాయితో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

లారీల డ్రైవర్లకు మొబైల్ స్లిప్‌లు

» సీతానగరంలో హైవేపై రెండు కిలోమీటర్ల మేర నిలిచిన ఇసుక లారీలు


రహదారిపై నిలిచిపోయిన ఇసుక లారీలు


మొబైల్ స్లిప్‌లు పంపిణీ వాహనం వద్ద లారీ డ్రైవర్లు

సీతానగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానంలో ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం శ్రీరామనగరం పెట్రోల్ బంక్ నుంచి రాష్ట్ర హైవేపై మంగళవారం రెండు కిలోమీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.ఇంతకీ అసలు దీనిపై ఏంటా అని ఆరా తీస్తే పెట్రోల్ బంక్ వద్ద మొబైల్ స్లిప్‌ల(కారులోనే స్లిప్‌ల పంపిణీ) కేంద్రం ఏర్పాటు చేశారు. లారీడ్రైవర్లు ఆ కారు వద్ద గుమిగూడి వాటిని తీసుకుంటున్నారు. దీంతో లారీలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. ఇసుక ర్యాంపువద్ద చేయాల్సిన పని రోడ్డుపై లారీలను నిలిపి పనులు చేసుకోవడంపట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఇసుక రవాణా లేకపోవడం, తిరిగి మంగళవారం ప్రారంభం కావడంతో ఇసుక లారీలు భారీ సంఖ్యలో వస్తున్నాయి.

సొంతగూటికి చేరడం సంతోషం ఉంది: టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ

రాజమహేంద్రవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరడం సంతోషంగా ఉందని, తన కుటుంబం రాజకీయ జీవితం ప్రారంభించిన సొంత గూటికి తిరిగి చేరానని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు ఎస్.రాజీవ్ కృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీవర్గాలు, అభిమానులకు, నేతలకు కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం సందేశాలు పంపారు. తన మామయ్య కృష్ణబాబు ఐదుసార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. విజనరీ నేతలైన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

జగ్గంపేటలో 116 ఏళ్ల వృద్ధుడి మృతి


బూరా చిన్న అప్పారావు

జగ్గంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన శతాధిక వృద్ధుడు బూరాచిన్న అప్పారావు సోమవారం మృతి చెందాడు. జగ్గంపేటలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన ఆయన 116 సంవత్సరాలు జీవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందిరాగాంధీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంనుంచి ఈయన రాజకీయాల్లో పని చేస్తూ చివరి దశ వరకు ఆరోగ్యంగానే ఉన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి నడిచాడు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై కేసు

కాకినాడ క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన సంఘటన మంగళవారం కాకినాడలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడుకు చెందిన 17ఏళ్ల విద్యార్థిని అధికారి సత్యసాయి కరుణశ్రీ, కాకినాడ శాంతినగర్‌కు చెందిన 17ఏళ్ల విద్యార్థిని కటికలపూడి నాగశ్రీ కొత్త కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వారిద్దరూ మంగళవారం కళాశాలకు డుమ్మా కొట్టి ఎస్ఆర్ఎంటీ మాల్‌కు వెళ్లారు. అక్కడి నుంచి వేరేవాళ్ల ఫోన్‌లో ఇద్దరి ఇళ్లకు ఫోన్ చేసి తాము గుడికి వెళ్లి వస్తామని చెప్పి ఫోన్ పెట్టేశారు. అప్పటినుంచి విద్యార్థినులు ఇద్దరు ఇళ్లకు వెళ్లకపోయేసరికి ఇద్దరి తల్లిదండ్రులు కాకినాడ టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థినుల ఆచూకీ కోసం సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.99లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,99,009 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

లంచం వ్యవహారంలో రాజమండ్రి సీఐ దుర్గారావు సస్పెండ్

గుడివాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడ టూటౌన్ సీఐగా పనిచేసిన కాలంలో లంచం వసూళ్ల కేసుల్లో ప్రస్తుత రాజమహేంద్రవరం సీఐ దుర్గారావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలిచ్చారు. 2022లో భూవివాదంలో దుర్గారావుపై ఏసీబీని ఫిర్యాదుదారుడు ఆశ్రయించారు. రెండు వర్గాలకు సంబంధించి రూ.30లక్షల వివాదాన్ని పరిష్కరించే క్రమంలో దుర్గారావు కొన్ని డాక్యుమెంట్‌లను బలవంతంగా తీసుకుని వ్యతిరేక వర్గానికి ఇచ్చారు. సదరు డాక్యుమెంట్‌లను వెనక్కి ఇవ్వాలని ఫిర్యాదుదారుడు సీఐని కోరగా డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా దర్యాప్తులో నేరం రుజువు కావడంతో సీఐ దుర్గారావుపై క్రిమినల్ కేసును పెట్టి సస్పెండ్‌కు సిఫారసు చేస్తూ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

పదో తరగతి పరీక్ష ఫీజును 26 లోపు చెల్లించాలి

» కాకినాడ జిల్లా డీఈవో

కాకినాడ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, ఒకసారి పరీక్షలకు హాజరై ఫెయిలైన విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 26 లోపు చెల్లించాలని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. నామినల్ రోల్స్ డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈనెల27నుంచి డిసెంబరు 2లోపు,రూ.200 అపరాధ రుసుంతో డిసెంబరు 3వ తేదీ నుంచి 9వతేదీ లోపు, రూ.500 అపరాధ రుసుంతో 10వతేదీ నుంచి 16వతేదీ లోపు చెల్లించాలన్నారు. నామినల్ రోల్స్ తోపాటు పరీక్షఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు.

ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలి

» కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి » భారత మాజీ ప్రధాని జయంతి



రాజానగరంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యం తీసుకువచ్చేవిధంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. రాజమహేంద్రవరం వై జంక్షన్ ఇందిరాగాంధీ తపోవనంలో జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వరరెడ్డి ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. తపోవనంలో ఇందిరా గాంధీ విగ్రహాన్ని ప్రముఖ సిద్ధాంతి రామలింగ ఏర్పాటు చేయగా నాటి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రారంభించారని గుర్తు చేశారు. అనంతరం రోడ్డుపై వెళ్లే వాహనాదారులను ఆపి స్వీట్లను పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, అబ్దుల్లా షరీఫ్, బెజవాడ రంగా, కిషోర్‌కుమార్ జైన్ పట్నాల శ్రీనివాస్, బిల్డర్ బాబీ, బత్తిన చంద్రరావు, శారద పాల్గొన్నారు.

కడియం: బుర్రిలంకలో నియోజకవర్గ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఇంటి వద్ద ఇందిరాగాంధీ జయంతి జరిపారు. ప్రధానిగా ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా.. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, వైఎస్ విజయమ్మ, మాజీ ఎంపీ వివేకానందరెడ్డి కుమార్తె సునీతలపై సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టిన విషయంపై వర్రా రవీంద్రరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, అతడి పీఏ రాఘవరెడ్డిపై కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ నాగదుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాడాల కొండ్రాజు, మండలాధ్య క్షుడు సత్యనారాయణరాజు, పులిశెట్టి సత్తిబాబు, పాటంశెట్టి చిన మహాలక్ష్మినాయుడు, కొత్తపల్లి జడ్డి, కె.చక్రధరరావు ఉన్నారు.

రాజానగరం: రాజానగరంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వైపె వడయార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వై.శ్రీనివాస్‌వడయార్ అధ్యక్షతన ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాస్, పల్లేటి కృపానందం పాకా సురేష్, అనురాధ వడయార్, కె.రాహేలు సత్యవతి, సుభాష్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై చైతన్యం

» ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాంతికోసం ఒక ప్రదేశం అనే సందేశాత్మక నినాదంతో 2024లో మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలతో వెళుతున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా నీరు, పారిశుధ్య కమిటీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరుచుకోవాలన్నారు. డీఆర్‌డీఏ ద్వారా మహిళలు, ప్రజలను భాగస్వామ్యం చేసి మరుగుదొడ్ల వినియోగం పెంచాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సామర్థ్యం పెంచడం ద్వారా గ్రామ స్థాయిలో మెరుగైన ఫలి తాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు నిరంతరం పారిశుధ్య నిర్వహణ వ్యవస్థను మెరుగుపరుచుటలో పారిశుధ్య కార్మికులను ప్రోత్సహించాలన్నారు. సమాజ హితం కోరే వ్యక్తులుగా సమాజంలో ఆత్మ గౌరవ వ్యక్తులు శానిటరీ సిబ్బంది అని అన్నారు. ఈ సందర్భంగా టాయిలెట్ నిర్వహణ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.10 వేల నగదు పురస్కారం అందించాలని సూచించారు. మరుగుదొడ్లపై అవగాహన శిబిరాలను డిసెంబరు 10 తేదీ వరకు కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో పారిశుధ్యంలో చురుకైన పాత్ర పోషించిన కార్మికులు గంజే వీరమ్మ, నల్లేపు సింహాచలం, పేరంపల్లి వీరాస్వామి, ఎ.బేబి, మేరీ, విజయలను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బీవీ గిరి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీ ఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్‌మూర్తి, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, డీఈవో కె.వాసుదేవరావు, జిల్లా భూగర్భ జల శాఖాధికారి వై.శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అవగాన కల్పించాలి

అనపర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ టాయిలెట్ల వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాన కల్పించాలని, బహిరంగ మల,మూత్ర విసర్జనలు పూర్తిగా నిషేధించాలని ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక మార్కెట్లో ఐఎల్‌టీడీ సౌజన్యంతో టాయిలెట్లు నిర్మించిన లోకేశ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా పబ్లిక్ టాయిలెట్ల వినియోగంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీపై ఆందోళన వద్దు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీపై అభ్య ర్థులెవరు ఆందోళన చెందవద్దని టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దారా ఏసురత్నం అన్నారు. రాజమహేంద్రవరం లక్ష్మీవారపుపేటలోని తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఐదేళ్లుగా భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థను మంత్రి నారా లోకేశ్ గాడిలో పెడుతున్నారన్నారు.

8 నుంచి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్



రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్ 19(ఆంధ్రజ్యోతి):డిసెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు వైజాగ్, గాజువాక జింక్ గ్రౌండ్ నందు 10 జిల్లాల దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని ఏపీ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ తెలిపారు.క్రికెట్ టోర్నమెం ట్‌కి సంబంధించిన సమావేశం ఆదివారం నిర్వహించారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు ఈ నెల 20,21 తేదీల్లో 98858 64940,92473 86666లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.22వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు లాలాచెరువు గ్రౌండ్‌లో ఎంపిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప ల్నాటి బలరామకృష్ణ,డి.హరీష్,ఏ.అఖిల్,ఎం.చంద్రమౌళి,రాము,సురేష్ పాల్గొన్నారు.

పనిగంటలు పెంచితే విద్యార్థులపై ఒత్తిడి

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరగబోయే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులంతా నడుంకట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అన్నారు. రాజమహేంద్రవరం యూటీఎఫ్ హోంలో మంగళవారం జరిగిన జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జయకర్ మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకను విజయంతం చేద్దామన్నారు. ఇటీవల ప్రభుత్వం పాఠశాల పనివేళలు ఒక గంట పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందని, నియమిత పనిగంటలు మించి విద్యార్థులకు బోధన సాగిస్తే పిల్లలు ఒత్తిడికి గురవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అసోసియేట్ విజయ గౌరీ, జిల్లా కార్యదర్శులు, నాయకులు, పరిశీలకులు, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆవాస్ యాప్‌పై అవగాహన

సీతానగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆవాస్ ఫ్లస్ యాప్‌పై సీతానగరం హౌసింగ్ ఏఈ నాగచక్రం ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి, తాటాకిల్లు ఉన్నవారిని, ఖాళీ స్థలాలు ఉన్నవారిని సంప్రదించి వారికి ఇల్లు కట్టుకునే ఉద్దేశ్యం ఉంటే వారి అన్ని వివరాలు యాప్‌లో పొందుపరుస్తారని చెప్పారు. కార్యక్రమంలో సచివాయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

1న చలో విశాఖ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న బీఎస్పీ ఆధ్వర్యంలో చలో విశాఖ పే రిట మహాధర్నా నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ జి.చిత్రసేను తెలిపారు. రాజమహేంద్రవరం గోకవరం స్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్, పరమట గణేశ్వరరావు, కొండపల్లి సూరిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

భూమాఫియాపై విచారణ జరపాలి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి లేఖ



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో భూమాఫియాపై ప్రత్యేక విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. అసె ంబ్లీ సమావేశాల్లో మంగళవారం ఆయన రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు లేఖ అందించారు. 1977లో రాజమహేంద్రవరం సీటీఆర్ఐ ఎదురుగా పబ్లి క్ సర్వెంట్స్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసిన భాస్కర్‌నగర్ భూమాఫియా చేతుల్లోకి పోయిందన్నారు. గత వైసీపీ నాయకులు ల్యాండ్ మాఫియాకు మద్దతుగా నిలిచారన్నారు.భూయజమానులకు న్యాయం చేసేందుకు అసవరమైన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

» ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు
» గ్రంథాలయ వారోత్సవాలు
» జాతీయ మహిళా దినోత్సవం



రంగంపేటలో వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బిక్కవోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు సూచించారు. గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య స్వగ్రామమైన కొంకుదురు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. దిశ చట్టం, మహిళా సాధికారతపై ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. సమాజంలో స్ర్తీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారు సాధించిన విజయాలను హిందీ టీచర్ శిరీష వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.బాల పాల్గొన్నారు.

కడియం: కడియం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి శెట్టిపల్లి శ్రీదేవినిర్మల ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఝాన్సీలక్ష్మిబాయి, దుర్గాబాయి దేశ్‌ముఖ్‌లకు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ రంగాల్లో మహిళలను సత్కరించారు. సబ్‌రిజిస్ర్టార్ చేతులమీదుగా పిల్లలు, మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎన్ఎం సునీత, చిలుకూరి వెంకటేశ్వరరావు, వైద్యసిబ్బంది కృష్ణవేణి, జె.సునీత, శాంతి, వి.సునీతభవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి విశ్రాంత అధ్యాపకురాలు పీవీ మాధవి విచ్చేసి మాట్లాడారు. విద్యా చైతన్యం సమాజ ప్రగతికి మూలమన్నారు. ఈ సందర్భంగా దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, సరోజినిదేవీ, రాణి రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటాలకు నివాళులర్పించారు. మహిళలు కూడా ఉన్నత విద్యాభ్యాసం ద్వారా సమాజ ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. వీరనారీమణుల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు సుమారు 65 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బి.లక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: కందుకూరి వీరేశలింగం టౌన్ హాల్‌లో జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ అధ్వర్యంలో లైబ్రరీ కార్యదర్శి ఆకుల వీర్రాజు విద్యార్థులకు క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా గౌతమి, సీతంపేట గ్రంథాలయాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్‌హాల్ సభ్యులు నల్లం శ్రీనివాస్, రెడ్డి రాజు, కె.సత్యనారాయణ, లైబ్రేరియన్ సుబ్బారావు, ఎస్వీ రమణ, కె.కమల్, బి.రత్నాంబ, డాక్టర్ అనురాధ, నారాయణరావు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బత్తుల నాగేశ్వరరావు

దివాన్‌చెరువు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన బత్తుల నాగేశ్వరరావు(నాగు) నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మండలంలోని శ్రీకృష్ణపట్నం గ్రామస్థుడైన బత్తుల ప్రస్తుతం దివాన్‌చెరువులో నివాసముంటున్నారు. ఇటీవల వరకూ టీడీపీ జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. తాను 35 ఏళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పలు పదవులు నిర్వహించానన్నారు. 2021లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున జడ్పీటీసీ పదవికి పోటీలో నిలిచినప్పటికీ అధిష్ఠానం నిర్ణయం మేరకు పోటీ నుంచి ఉపసంహరించుకున్నారు. తాజాగా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచనలేకుండా నిర్వర్తిస్తానన్నారు. యాదవుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

సీఐ సత్యకిషోర్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సత్యకిషోర్

కోరుకొండ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పేకాట, గుండాట, కోడి పందాలు, సారా విక్రయాలు, గంజాయి, ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ వై.సత్యకిషోర్ పేర్కొన్నారు. మంగళవారం కోరుకొండ సర్కిల్‌లో ఉన్న గోకవరం, కోరుకొండ, సీతానగరం సబ్ ఇన్‌స్పెక్టర్లు పవన్‌కుమార్, రామ్‌కుమార్, శ్యామ్‌సుందర్, ఇతర సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా కోరుకొండ సర్కిల్ పరిధిలో కోడిపందాలు కోసం ఎవరూ కూడా కోడికత్తులు తయారు చేయడం కానీ, కోడిపందాలు ఆడటానికి స్థలాలు సమకూర్చడం కానీ చేయకూడదన్నారు. ఒకవేళ వీటిని ఎవరైనా అతిక్రమిస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్‌నేరాలకు అరికట్టడంపై చర్చించారు. మొబైల్ ఫోన్‌లకు ఏదైనా లింకువస్తే వాటిని ఓపెన్ చేయకూడదన్నారు. అదేవిధంగా అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత డేటాను షేర్ చేయకూడదన్నారు. కాలేజీలు, స్కూల్స్ బస్టాండ్ల వద్ద ఇతర ప్రదేశాల్లో ర్యాగింగ్ చేయకూడదన్నారు. గంజాయి అమ్మడం, ట్రాన్స్‌పోర్టు చేయడం, సారా అమ్మకం, తయారీ, రవాణా వంటివి ఎవరుచేసినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు ఉపయోగించి ఎవరైనా కించపరిచేటట్లు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని, చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ సత్యకిషోర్ చెప్పారు.

20 కోడి కత్తులు, బైక్ స్వాధీనం

● వన్‌టౌన్‌లో కేసు నమోదు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మంగళవారపుపేటకు చెందిన కోసన బాలవెంకట అర్జునరా వు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 కోడికత్తులు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలో కోడి పందాలను అరికట్టేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేకనిఘా టీమ్ దాడులు చేస్తుంది. దాడులు చేసి కోడికత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశా రు. ఎవరైనా పేకాటలు, కోడిపందాలు నిర్వహించినా అసా ంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

కిక్కిరిసిన శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం



బిక్కవోలులో శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

బిక్కవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో మంగళవారం కావడంతో బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈసందర్భంగా 369 మంది జంటలు రజ, కుజ, కాల, సర్ప దోష నివారణార్థం వ్రతాలు ఆచరించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి సత్యనారాయణ శర్మ, సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మలు స్వామిని పంచామృతాలతో అభిషేకించి, పది మంది రుత్వికులతో లక్ష బిల్వార్చన జరిపారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ ఆలయ ఆవరణలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉచిత అన్న ప్రసాదాన్ని అందించామని ఆలయ ఈవో ఆకెళ్ల రామ భాస్కర్ తెలిపారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

ధవళేశ్వరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కార్తీకపర్వదినాలు పురస్క రించుకుని దేవదాయశాఖ పరిధిలోని శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత అగస్తేశ్వరస్వామి ఆలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారికి లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం బ్రాహ్మణులు, పురోహితులు వేద మంత్రోచ్ఛరణలతో మేళతాళాలు మధ్య గాయిత్రీమాతా, శంకరాచార్యులు వారి చిత్రపటాలతో ఆలయానికి చేరుకున్నారు. అగస్తేశ్వర స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వాలతో బిల్వార్చన నిర్వహించారు. అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసభాపతి మంగళంపల్లి శేఖర్ శాస్త్రి, విలువెంటి రాజా, కె. శ్రవణ్‌కుమార్‌శర్మ, ఆలయ అర్చకులు విశ్వనాధశర్మ, చిన్న శర్మలు, చింతా సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న సీఐ గణేష్

ధవళేశ్వరం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాంబే కాలనీ, రాజీవ్ కాలనీల్లో స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, మహిళలను, ఆడపిల్లలను వేధిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరరావు, ఎస్‌బీ ఏఎస్ఐ సుభాకర్,హెడ్ కానిస్టేబుల్ మూర్తి పాల్గొన్నారు.

కంబాల చేరికతో బీజేపీ మరింత బలోపేతం

● బీజేపీ కాకినాడ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్



శ్రీనివాసరావుకు పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న రామ్‌కుమార్

గోకవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు త్వరలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ)లో చేరనున్నారని, ఆయన చేరికతో స్థానికంగా బీజేపీ మరింత బలోపేతం కావడం ఖాయమని ఆ పార్టీ కాకినాడజిల్లా పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక సీఎండీ కేఎస్‌పీవీ లే అవుట్‌లో మంగళవారం శ్రీనివాసరావును రామ్‌కుమార్ కలిసి బీజేపీ పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ కంబాల హిందూధర్మ పరిరక్షణ కోసం అందిస్తున్న సేవలు అభినందనీయ మన్నారు. ప్రజలకు, పార్టీ కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి శ్రీనివాసరావును బీజేపీలోకి ఆహ్వానించామన్నారు. సుమారు 30వేల సభ్యత్వాలను ఇప్పటివరకు పూర్తిచేసి ఇటు నియోజకవర్గానికి, అటు జిల్లాకు శ్రీనివాసరావు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టారని కొనియాడారు. అందుకే తాను ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ పూర్తయిన అనంతరం బీజేపీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, వల్లూరి జగన్నాధశర్మ, కట్టా కళ్యాణ్, బీజేపీ నాయకులు మట్టా మంగరాజు, దాట్ల కృష్ణవర్మ పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన టీడీపీ నేతలు



ఏఎస్పీ బాలమురళీకృష్ణకు మొక్కను అందజేస్తున్న అమరనాథ్, రాజేష్

కడియం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కడియం మండలం జేగురుపాడు సీనియర్ టీడీపీ నాయకులు గారపాటి శ్రీఅమరనాథ్, గ్రామ ఉపసర్పంచ్ పాతూరి రాజేష్‌లు మంగళవారం ఏఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణను రాజమహేంద్రవరంలో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మర్రెడ్డి రమేష్, వనమాలి వెంకట బాలాజీ, గోణం నాగేశ్వరరావు, సత్యనారాయణ ఉన్నారు.

తప్పక విత్తనశుద్ధి చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయఅధికారి ఇమామిఖాసిం

దివాన్‌చెరువు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : రైతులు దాళ్వావరినారుమడులు వేసే సమయంలో తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.కె. ఇమామిఖాసిం అన్నారు. మండలంలోని సంపత్‌నగరం, జి.ఎర్రంపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం వలన విత్తనం, నేలనుంచి సోకే తెగుళ్ల నుంచి రక్షణ కలిగి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ప్రతీరైతు తప్పనిసరిగా పంట నమోదు, పంటబీమా తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీపీటు ఏడీఏ శాంత ఆలివ్, గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్ సురేఖ, ప్రత్యూష, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అనపర్తిలో 108 సిబ్బంది నిరసన


అనపర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ కోర్కెలు పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ 108 సిబ్బంది ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మె నోటీసులు జారీచేసిన సందర్భంగా సిబ్బంది మంగళవారం నుంచి వినూత్న నిరసన కార్యక్రమాలకు శ్రీకారంచుట్టారు. మంగళవారం అనపర్తి 108 సిబ్బంది తమ 108వాహనం ముందు భాగంలో అద్దానికి 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని స్టిక్కర్లు అతికించి నిరసన తెలిపారు. అదేవిధంగా వీరు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో 108 సిబ్బంది డోకుబుర్ర ఆనందరావు, నడిపూడి ఆదినారాయణ, డి.మురళీకృష్ణ, జె.ఇందు పాల్గొన్నారు.



అనపర్తిలో నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తున్న 108 సిబ్బంది

ఘనంగా పురుషుల దినోత్సవం

రాజానగరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల మహిళా అధ్యాపకులు పురుషుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పురుష అధ్యాపకులకు బెలూన్ గేమ్, పజిల్స్ ఫన్నీ గేమ్స్ క్రికెట్ గేమ్స్ తదితర క్రీడలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి.ధనరాజు మహిళా అధ్యాపకులు, పురుషులకు వినూత్నరీతిలో క్రీడా పోటీలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం థీమ్ సానుకూల రోల్ మోడల్స్ అన్నారు. సీనియర్ అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకల్లో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



175 చోట్ల విషతుల్యం..

తూర్పు,మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్లు విషతుల్యంగా మారిన ట్టు నీటిపారుదలశాఖ రెండేళ్ల కిందటే గుర్తించింది.కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు,మునిసిపాల్టీలు సర్వే చేశాయి. అత్యధికంగా కోనసీమలో కోళ్లు,రొయ్యల వ్యర్థాలు, కడియం,ద్వారపూడి,అనపర్తి,బిక్కవోలు,సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్లు వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు.ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం,భూగర్భ జలాలు సైతం కలుషితమైనట్టు ఆయాశాఖలు తేల్చాయి. కాలువలు కాలుష్యంగా మారినచోట వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అప్పట్లో ప్రయత్నించారు.కానీ అప్పటి ప్రభుత్వం ప్రచారం కోసం మినహా పైసా కూడా ఇవ్వకపోవడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడ్డాయి.

వచ్చే పుష్కరాలకు..



ఒకటే ఘాట్!

పుష్కర ఘాట్ టు కోటిలింగాల ఘాట్

- ఘాట్లు అనుసంధానించే యోచన
- 2 కి.మీ ఏక ఘాట్‌కు సన్నాహాలు
- గత పుష్కర అనుభవాలే కారణం
- ప్రతిపాదన దశకూ చేరని ఫైల్
- కొవ్వూరు వైపు కానరాని అభివృద్ధి
- ఇక అధికారులు దృష్టి పెట్టాల్సిందే

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పవిత్రగోదావరి పుష్కరాలు 2027లో రాజమహేంద్రవరం కేంద్రంగా జరుగబోతున్నాయి. వాటికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది.ఈ మేరకు ఇప్పటికే రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో కలెక్టర్ ప్రశాంతి ఒక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పుష్కరాల అభివృద్ధి పనులు, రేవులకు ప్రధాన రహదారుల అనుసంధానం తదితర అంశాలపై చర్చించారు. అయితే ఈసారి గోదావరి పుష్కరాలకు సాన్నాల ఘాట్ల అనుసంధానం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారు. గత పుష్కరాలకు రాజమహేంద్రవరం వచ్చిన ప్రతి భక్తుడు పుష్కరాలరేవులోనే సాన్నం చేయాలనే తపనతో పెద్ద ఎత్తున పుష్కరాల రేవుకు రావడంతో ప్రమాదం జరిగిన ఘటన విదితమే. ఈ సారి మాత్రం అటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి రేవు పుష్కరాలరేవే అనే నమ్మకం భకుల్లో కల్పించేందుకు ఘాట్ల అను సంధాన ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు.

2 కి.మీ మేర ఒకటే రేవు..

రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవు, కోటిలింగాల రేవులను కలుపుతూ ఒక అతిపెద్ద స్నానాల రేవులను నిర్మించాలనే ఆలోచన అధికార యంత్రాంగం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉన్నారు. ఈ రెండు రేవులు అనుసంధానం చేస్తే సుమారుగా రేవు పొడవు 2 కి.మీ ఉంటుంది. గతంలో అప్పటి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కోటిలింగాల రేవు నుంచి చింతాలమ్మఘాట్ ,పద్మావతి ఘాట్లను కలిపి పెద్దఘాట్‌గా నిర్మించారు. ఇప్పుడు ఆదిరెడ్డి వాసు కోటిలింగాలఘాట్ నుంచి పుష్కరాల రేవు వరకు అనుసంధానం చేసి అతిపొడవైన ఘాట్‌ను నిర్మించతలపెట్టినట్టు తెలిసింది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంది. పుష్కరాలరేవుపై పడే భారీ రద్దీని తగ్గించే యోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గోదావరి గట్టుపై కనకదుర్గమ్మ ఆలయం, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక నుంచి నల్లా చానల్ గ్యాప్ నుంచి శేషయ్యమెట్ట సరిహద్దులు, జలవనరుల శాఖ భవనం, లాహాస్పిన్ హోటల్ వెనుక, రియలన్స్ స్మార్ట్ షాపింగ్ మాల్ వెనుక భాగం గుండా ఈ పుష్కరాల రేవుకు ఘాట్‌ను అసందానం చేస్తారు. సాన్నాల రేవులు ఆధునీకరించే పనులు 2027 పుష్కరాల నాటికి పూర్తి చేసే విధంగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర నుంచి తొలి దఫాగా రూ100 కోట్లు నిధులు కేటాయించారు. ఇంకా నిధులు తీసుకు వచ్చే పనిలో కూటమి ప్రజాప్రతినిదులు నిమగ్నమయ్యారు.2025 జనవరి నుంచి పుష్కర పనులు ఆరంభమయ్యే ఆవకాశాలున్నాయి.

కొవ్వూరు వైపు చూడాలి..

రాజమహేంద్రవరంలో పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా కొవ్వూరు రేవును విస్తరించాల్సి ఉంది. ఇప్పటికి గోష్పాదక్షేత్రం రేవునే స్నానాలకు వినియోగిస్తారు. ఆ రేవు విస్తీర్ణం కూడా పెంచితే భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. కొవ్వూరు వైపు రేవుల విస్తీర్ణం పెంచడానికి పెద్ద ఇబ్బందికరమైన పరిస్థితులు ఉండవు. అధికారులు ఆ దిశగా కూడా ఆలోచిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



గోదారంతా.. గరళమే!



ఈ వ్యర్థం.. అనర్థమే : కాలువలను కలుషితం చేస్తున్న వ్యర్థాలు

ఒకనాడు గోదావరి కాలువల్లో నీటిని చేతితో ఒడిసిపట్టి తాగేవాళ్లం.. ఇప్పుడు ఆ నీరు తాగాలంటేనే భయమేస్తోంది.. ఇదీ ఒక 70 ఏళ్ల పెద్దాయన మాట.. మేం గతంలో గోదావరి కాలువల నీటినే బిందెలతో తెచ్చుకుని తాగేవాళ్లం.. ఇప్పుడు నీటిని కొనుక్కుని తాగుతున్నాం.. ఇదీ 60 ఏళ్ల బామ్మ మాట..ఎందుకంటే నాటికి నేటికి గోదావరి కాలువల నిర్వహణలో ఎంతో తేడా ఉంది.. ప్రస్తుతం కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి.. నీళ్లు తాగడం కాదు.. స్నానం చేయడానికే భయపడేంతగా నీళ్లు కలుషితమయ్యాయి.. రెండేళ్ల కిందట ఈ విషయం గుర్తించినా గత వైసీపీ ప్రభుత్వం మాటలు తప్ప.. అలాగే వదిలేసింది.. ఈ విషయం తెలియని ప్రజలు ఆ నీటినే తాగి రోగాల బారినపడ్డారు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్లీన్ గోదావరిపై దృష్టి సారించాల్సి ఉంది.. లేదంటే మరింత ప్రమాదం ముంచుకొస్తుంది..!

175 ప్రాంతాల్లో కాలువలు కలుషితం

- రెండేళ్ల కిందటే అధికారుల నివేదిక
- నాటి సీఎం రూ.100 కోట్ల హామీ
- రూపాయి కూడా విదల్చని వైనం
- కాలుష్య రహితం చేస్తామని గొప్పలు
- అటకెక్కిన 'మిషన్ క్లీన్ గోదావరి'
- ఉమ్మడి జిల్లాలకు కలుషిత నీళ్లు
- వేలాది మందికి ఈ నీళ్లే దిక్కు
- నేటికీ మారని తీరు
- ఎక్కడికక్కడ యథేచ్ఛగా వ్యర్థాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు అటకెక్కిపోయింది. నాలుగేళ్ల నుంచీ పనుల్లో అతీగతీలేక ఎక్కడిదక్కడే అన్నట్టు ఆగిపోయింది.ఉమ్మడి జిల్లాలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయిన నేపథ్యంలో వాటిని శుద్ధి చేస్తామని ప్రకటించి గత వైసీపీ సర్కారు గాలికొదిలేసింది.ఈ నీటిని శుద్ధి చేశాకే పంట కాలువల్లోకి నీరు వదులుతామని ప్రగల్భాలు పలికింది. ఈ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు గొప్పలు చెప్పిన అప్పటి సీఎం జగన్ తీరా నిధుల మంజూరును కాగితాలకే పరిమితం చేశారు.కానీ క్షేత్రస్థాయిలో గత నాలుగేళ్లుగా కనీసం పట్టించుకోకపోవడంతో కాలువలు దయనీయంగా మారాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో 175 చోట్ల గోదావరి కాలువల వద్ద కాలుష్యం తీవ్రంగా ఉందని గుర్తించారు. కూటమి ప్రభుత్వం కాలువల బాగుపై దృష్టిసారించాలని అన్నదాతలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన మిషన్ క్లీన్ గోదావరి కార్యాలయం ఇప్పటికీ కొనసాగుతున్న నేపథ్యంలో కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని అటు జలవనరులశాఖ భావిస్తోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

ఎక్కడికక్కడ భయానకం...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు,మధ్యడెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ,తూర్పుడెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్ల లక్షల ఎకరాల సాగు,తాగునీటికి ఆధారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. వీటి వెంబడి ఉన్న వందలాది గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. గృహనిర్మాణ వ్యర్థాలు,చికెన్, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వ్యర్థాలను కాలువల్లో వదిలేస్తున్నారు. కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలు ఉన్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు కలిపేస్తు న్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు.ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నా బయటకు తెలియడం లేదు. పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. ఇదంతా ఒకెత్తయితే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో అనేక రకాల పరిశ్రమలున్నాయి.వీటిలో కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి.కానీ ఖర్చుసాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. రాజమహేంద్రవరంలో మురుగునీటిని నల్లా ఛానల్ ద్వారా గోదావరిలో కలిపేస్తారు. కలుషితం అని తెలిసినా ఈ నీటినే ఓ మోస్తరు శుద్ధిచేసి పంచాయతీలు,మునిసిపాలిటీలు,కార్పొరేషన్లు ప్రజలకు తాగునీటిగాసరఫరా చేస్తున్నాయి.

నాడు గాలికొదిలేసిన వైసీపీ



ఇంత దారుణమా : కాలువ ఒడ్డున వేసిన చెత్త

గత వైసీపీ సర్కారు మిషన్ క్లీన్ గోదావరి పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది.సీఎం ఛైర్మన్‌గా ఉండే ఈ బోర్డు ద్వారా జిల్లాలో గోదావరి కాలువలను శుద్ధి చేసి,ఆ తర్వాతే నీటిని కాలువల్లోకి వదులుతామని.. రూ.100 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్టు అప్పటి సీఎం జగన్ పలు సమీక్షల్లో గొప్పగా ప్రకటించారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలువల వద్ద ఎక్కడెక్కడ పరిస్థితి తీవ్రంగా ఉందో అధ్యయనం చేశారు. తీరా నిధులు అవసరమైన తరుణంలో అప్పటి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా నిధులు మంజూరు చేయలేదు. కేవలం నిధులిస్తున్నట్టు కాగితాలపై ఆదేశాలు జారీచేశారు. ఇలా మొన్న దిగిపోయే వరకు వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై మాటలు తప్పించి పనులు జరిగేలా కనీస శ్రద్ధ చూప లేదు. దీంతో మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టు పూర్తిగా అటకెక్కినట్లయ్యింది. గత ఐదేళ్లలో గోదావరి కాలువల నిర్వహణను జగన్ సర్కారు గాలికివదిలేసింది.అటు పూడిక పెరగడం, మరో పక్క కాలుష్య తీవ్రత మరింత పెరిగి ప్రస్తుతం అత్యంత హానికరంగా తయారయ్యాయి.

కూటమి..పట్టాలెక్కించాలి..

కూటమి ప్రభుత్వం గోదావరి కాలువలపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టుకు ఇటీవల ఓ ఐఏఎస్‌ను కూడా సర్కారు నియమించింది.దీంతో ఎంతో కొంత నిధులు, లేదా కంపెనీల సీఎస్ఆర్ నిధుల సాయంతో కాలువల ప్రక్షాళన చేయాల్సి ఉంది.ఇదే విషయమై జలవన రుల శాఖ సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. మిషన్ క్లీన్ గోదావరి ప్రాజెక్టుకు గత ప్రభుత్వం పైసా కూడా ఇవ్వని నేపథ్యంలో ఏం చేయలేకపోయామని దీంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగిందని వివరించింది.కూటమి ప్రభుత్వం గోదావరి కాలువల్లో కాలుష్యాన్ని నివారించే ప్రాజెక్టును పట్టాలెక్కి స్తుందని ఆయాశాఖల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

మిడ్‌డే మీల్స్ పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం అమలులో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి సూచించారు. బొమ్మూరు జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందజేసే మధ్యాహ్న పథకం వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట డీఈవో వాసుదేవరావు వున్నారు.

నాలుగు కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

రాజమహేంద్రవరంసిటీ,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో మరొక నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను కూటమి ప్రభుత్వం ప్రకటించింది.యాదవ, గౌడ, మాల, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్లకు 15 మంది చొప్పున సభ్యులను ప్రకటించారు. యాదవ కార్పొరేషన్‌కు రాజానగం నుంచి టీడీపీ నాయకుడు బత్తుల నాగేశ్వరరావు,గౌడ కార్పొరేషన్ నిడదవోలు నుంచి టీడీపీ నాయకుడు సూర్యారావు వెలగన, ఉండ్రాజవరం నుంచి జనసేన నాయకురాలు వీరమల్లు వరలక్ష్మి, రాజమహేంద్రవరం రూరల్ కొంత మూరు నుంచి జనసేన నాయకుడు యామన నారాయణ గౌడ్, రాజమహేంద్రవరం రూరల్ నుంచి మద్దా మణికి మాల కార్పొరేషన్ సభ్యులుగా అవకాశం లభించింది.

పరిమితికి మించి పొగాకు సాగు వద్దు 8
చట్ట వ్యతిరేక పనులపై నిఘా : ఎస్పీ

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా కాల్వలు : నల్లమిల్లి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధవళేశ్వరం బ్యారేజి దిగువన ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రధాన కాలువలు మురుగునీటి డ్రెయిన్ల కన్నా అధ్వానంగా ఉన్నాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంగళవారం గోదావరి కాలు వల ఆధునికీకరణపై మాట్లాడారు. గోదా వరి డెల్టా కాలువల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. రానున్న వేసవి సీజన్‌లో కాలువల్లో పూడిక తొలగించే చర్యలు చేపట్టాలన్నారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనపర్తి,రాజానగరం నియోజక వర్గాల్లో చాగల్నాడు, వెంకటాపు రం,పుష్కర పథకాల్లోని భూములు డి పట్టాలు అందడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తూర్పుగోదావరి డెల్టాలో మెయిన్ కెనాల్స్ 14, ప్రధాన కాలువలు 20, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మెయిన్ కెనాల్స్ 11,ప్రధాన కాలు వలు 21 ఉన్నాయని అంతే కాకుండా మురుగు నీరు పోయేందుకు మరికొన్ని కాలువలు ఉన్నాయని వాటిని పునరుద్ధరించాలన్నారు.



ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద రోడ్డుపై బైఠాయించి కార్మికుల నిరసన

ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ మాఫియాకు అడ్డాగా తయారైందని.. కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందజేయడంలేదని, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. సీతంపేట ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట మంగళవారం సీపీఐ, రాజమహేంద్రవరం జట్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రజాప్రతినిధులు ఈఎస్ఐ ఆసుపత్రిపై దృష్టి పెట్టాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎంపీ పురందేశ్వరి ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించి మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె. రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, సప్పా రమణ, భద్రరావు, రామకృష్ణ, రమణ, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులు చింతలపూడి సునీల్, కె.శ్రీనివాస్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

ప్రజారోగ్యానికి పాటుపడండి

ఆరోగ్య సహాయకుల శిక్షణలో డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 : గ్రామాల్లో ప్రజారోగ్యం కోసం కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఆరోగ్య సహాయకులకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చర్యలపై శిక్షణలో తెలియజేస్తారన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామీణ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా మలేరియా ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ జే.సంధ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సహాయకులు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ ఐ.రామకృష్ణారావు,నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈవో నాగు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు

- 1 నుంచి తనిఖీలు చేస్తాం
- ఏఎస్‌వో నాగాంజనేయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి జిల్లా వ్యా ప్తంగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు తెలిపారు. 'రేషన్ బియ్యం పక్కదారి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 16వ తేదీన ప్రచురితమైన కథనంపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. నిడదవోలు మండలం సూరాపురంలో మంగళవారం కొన్ని ఇళ్లు, కోళ్ళ ఫారంలను ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదే శాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అనుమా నితులను హెచ్చరించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న కోళ్ల ఫారంలలో కూడా తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో ఎ.సత్యనారా యణ, ఎస్ఎస్.సుధీర్ రెడ్డి, సివిల్ సప్లయిస్ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



సూరాపురంలో సివిల్ సప్లయిస్ అధికారుల తనిఖీ

ఉచిత ఇసుకకు అడ్డంకులు సృష్టిస్తే చర్యలు : జేసీ



బల్లిపాడు రీచ్‌లో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

తాళ్లపూడి, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : ఉచిత ఇసుకకు అడ్డంకులు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ చిన్నరాముడు హెచ్చరించారు. తాళ్లపూడి మండలం బల్లిపాడు రీచ్‌లో ఇసుక తవ్వకాలు, రవాణా మంగళవారం పరిశీలించి మాట్లాడారు. వీఆర్‌వోల వద్ద అనుమతులు తీసుకుని ఓపెన్ ర్యాంపుల నుంచి ప్రజలకు అవసరమైన ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టరు ద్వారా ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు. బల్లిపాడు, చిడిపి రీచ్‌లలో ఇసుక తవ్వి స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు గుత్తేదారులు ఎంపిక య్యారన్నారు.బల్లిపాడుకు చెందిన కూటమి నాయకులు శంకరం జగదీష్, రమేష్ మాట్లాడుతూ గుత్తేదారులు ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలిస్తూనే బయటకు విక్రయిస్తున్నారన్నారు. అక్కడ అధికారుల పర్యవేక్షణ ఉండాలని జేసీకి ఫిర్యాదు చేశారు.ఆయన వెంట ఆర్‌డీవో రాణీ సుస్మిత, డీటీ భారతి ఉన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు

» జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ » తాళ్లపూడి పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ


తాళ్లపూడి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ కిషోర్

తాళ్లపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సారా అమ్మకాలు, బెల్టు షాపుల నిర్వహణ, రేకా జూదాల వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై వీటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. తాళ్లపూడి పోలీసు స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిర్మూలన, వ్యసనాలను అరికట్టే విధంగా తమ పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం సిబ్బంది లోటుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ బదిలీల అనంతరం ప్రతి స్టేషన్‌లోనూ సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై గట్టి నిఘా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట డీఎస్పీ దేవకుమార్, రూరల్ సీఐ విజయబాబు, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ టి.రామకృష్ణ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

» విద్యార్థులకు అవగాహన సదస్సులో కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. మంగళవారం కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ యువతీయువకులు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉం డాలన్నారు. సోషల్ మీడియాలో ఫ్రీ గిఫ్టులు, ఉచిత బహుమతులు అంటూ వస్తున్న లింక్ లను తెరిచి మోసపోవద్దన్నారు. తెలియని వారితో ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించరాదన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌లో అపరిచిత నెంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఓటీ పీలు, పిన్ నెంబరు ఎవ్వరికి షేర్ చేయరాదన్నారు. బాలికలను వేధింపులకు గురిచేస్తే చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కొవ్వూ రు రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర నాయక్, చాంబర్ సభ్యులు చిలంకుర్తి బాబి, నాళం శ్రీనివాసరావు, మద్దుల నాని, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి సాయం పెంపు


ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రాణపాయస్థితిలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అమృతం లాంటిదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలో దొండపూడికి చెందిన కొమ్మిరెడ్డి బలరామకృష్ణ గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆర్థిక ఇబ్బందులు గుర్తించి స్థానిక కూటమి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సీఎం చంద్రబాబును స్వయంగా కలిసి పరిస్థితిని వివరించడంతో రూ.3 లక్షలకు ఇవ్వాల్సిన ఎల్‌వోసీని రూ.5 లక్షలకు పెంచి మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని బలరామకృష్ణ తల్లి పాపారత్నంకు సచివాలయం వద్ద అందించారు.కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు రొంగల సత్యనారాయణ, కోల్నాటి రాజేంద్ర, నాయకులు బండారు గనిరాజు, నూతంగి దొరబాబు, బద్రీ, వెల్లంకి జయశివసూర్యం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతను కాపాడుదాం

» లెఫ్టినెంట్ కల్నల్ అమిత్‌పాండే » నల్లజర్లలో ఎన్‌సీసీ కేడెట్ల కవాతు



ఎన్‌సీసీ కేడెట్ల ర్యాలీ ప్రారంభిస్తున్న ఏకేఆర్‌జీ చైర్మన్ గోకుల్

నల్లజర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి భారతీయ పౌరుడు జాతీయ సమైక్యతను కాపాడాలని ఎన్‌సీసీ 19వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ అమిత్‌పాండే అన్నారు. ఎన్‌సీసీ కేడెట్లకు నల్లజర్ల ఏకేఆర్‌జీ హైస్కూల్లో శిక్షణ తరగతులు వారం రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం క్యాడెట్లతో కవాతు నిర్వహించారు. ఈ సం దర్భంగా అమిత్ పాండే మాట్లాడుతూ జాతీయ సమైక్యత, క్రమశిక్షణతో కూడిన విద్యను పెం పొందించడానికి, ఆర్మీ శిక్షణకు ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ అనంతరం 2026లో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు సమర్థులైన క్యాడెట్లను ఎంపిక చేస్తామన్నారు. పతి విద్యార్థి ఆర్మీలో చేరి దేశ సమగ్రత కాపాడాలని కోరారు. ముందుగా ర్యాలీని కళాశాల చైర్మన్ చావా గోకుల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వడ్లమూరి రా మారావు, ఎస్‌ఐ సోమరాజు, ప్రిన్సిపాల్ కేఎల్ ఎన్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మా నిర్ణయాలకు విలువ లేదా?

ఎంపీడీవోను కలిసిన వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు

తాళ్లపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సమావేశాలు, గ్రామ సభల్లో తీసుకున్న నిర్ణయాలకు విలువ లేదా వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు ప్రశ్నించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణను మండలంలోని వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికాంరంలోకి వచ్చినప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలను గుర్తు చేస్తూ ఎంపీడీవోను ప్రశ్నించారు. సర్పంచులకు విలువ లేకుంటే పంచాయతీ బోర్డులన్నీ రద్దు చేయాలన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా తమ పరిపాలనకు ఆటంకం కలిగిస్తే కలెక్టరు దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించబోమని, అభివృద్ధి పనుల విషయంలో అందరి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు, వైస్ ఎంపీపీ కోదాటి కనకం, ఎంపీటీసీ గుంటు చిన్నాబ్బాయి, యాళ్ల బాబూరావు, పిట్లా శ్రీను, నున్న కృష్ణ పాల్గొన్నారు.

డిసెంబరు 10న చలో విజయవాడ

సీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు జోడాల


పోస్టరును ఆవిష్కరిస్తున్న సీపీఎస్ నాయకులు

తాళ్లపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 10న జరుగబోయే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో పో స్టరు ఆవిష్కరణ అనం తరం జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం పెన్షన్ లేని జీవితం దుర్భరమని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పద్మావతి, రాజకుమారి, పృథ్వీ, ప్రవీణ్, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరడం సంతోషం ఉంది

టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ

రాజమహేంద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరడం సంతోషంగా ఉంది. నా కుటుంబం రాజకీయ జీవితం ప్రారంభించిన సొంత గూటికి తిరిగి చేరానని ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ వర్గాలు, అభిమానులకు, నేతలకు కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం మెసేజ్‌లు పంపారు. మా మామయ్య స్వర్గీయ పెండ్యాల కృష్ణబాబు ఐదు సార్లు కొవ్వూరు ఎమ్మెల్యే గెలిచారన్నారు. విజనరీ లీడర్లయిన సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో చిత్తశుద్ధితో పనిచేస్తానని ప్రామిస్ చేస్తున్నట్టు తెలిపారు.

పరిమితికి మించి సాగు చేయొద్దు

కేంద్ర పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్


రైతు సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట బోర్డు పరిమితి మేరకే పండించాలని కేంద్ర పొగాకుబోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ అన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు రైతులతో ఆర్‌ఎం డీఎల్‌కే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావే శంలో ఆయన మాట్లాడు తూ అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ ఉండాలంటే రైతులు నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలన్నారు. గత ఏడాది ప్రతికూల పరిస్థితుల వల్ల జింబాబ్వే, బ్రెజిల్, ఆఫ్రికా, చైనా వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గడంతో ఈ ఏడాది మన పొగా కుకు ఎనలేని డిమాండ్ ఉందని, దాంతో భారీగా ధర లభించిందన్నారు. 2024-25లో ప్రపంచ దేశాల్లో పొగాకు పండించే అన్ని దేశాల్లో ఉత్పత్తి ఈ ఏడాది పెరిగిందని, దాని ప్రభావం మన దేశంపై కూడా పడవచ్చన్నారు. రాష్ట్రంలో 170 బిలియన్ కిలోల పంటకు పరిమితి ఇచ్చిందని, దానికి మించి పండించరాదన్నారు. పురుగు మందు అవశేషాలు లేకుండా నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని రైతులకు సూచించారు. గత ఏడాది పరిమితికి మించిన పొగాకుకు పెనాల్టి లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగిందని ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదన్నారు. ఆర్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు కౌలు పెంచడం, అనధికారికంగా బ్యారెన్లు నిర్మించడం, బాడవల్లో పొగాకు సాగు చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి హేమస్మిత, రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, నరహరశెట్టి రాజేంద్రబాబు, కేవీవీఎస్ నారాయణ, కాట్రు భీమరాజు, ఈలప్రోలు చిన్ని పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాగల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం జరుగుతుందని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు. వివిధ సమస్యలపై చర్చించి అభివృద్ధి పనులకు తీర్మాణాలు చేస్తామన్నారు.

8 నుంచి దివ్యాంగుల

క్రికెట్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి):డిసెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు వైజాగ్, గాజువాక జింక్ గ్రౌండ్ నందు 10 జిల్లాల దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని ఏపీ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌కి సంబంధించిన సమావేశం ఆదివారం నిర్వహించారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు ఈ నెల 20,21 తేదీల్లో 98858 64940, 92473 86666లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. 22వ తేదీ ఉదయం 10 గంటలకు లాలాచెరువు గ్రౌండ్‌లో ఎంపిక ఉంటుందన్నారు.కార్యక్రమంలో పల్నాటి బలరామకృష్ణ, డి.హరీష్, ఎ.అఖిల్, ఎం.చంద్రమౌళి, రాము పాల్గొన్నారు.

కొవ్వూరుపాడులో స్థల పరిశీలన


కొవ్వూరుపాడులో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో అమ్మాజీ

గోపాలపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొవ్వూరుపాడులో వివాదాస్పదమైన స్థలాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. కొవ్వూరుపాడు పంచాయతీ పరిధిలో ఒక వ్యక్తికి చెందిన స్థలాన్ని దళిత అభ్యుదయ యోజన సంక్షేమ సహాయక సంఘం భవనానికి కేటాయిస్తూ 2018లో అప్పటి పాలకవర్గం తీర్మానం చేసింది. దీనిపై అదే గ్రామానికి చెందిన దండే ప్రసన్నకుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీవో వై.అమ్మాజీ విచారణ చేపట్టాలంటూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవోతోపాటు ఇన్‌చార్జి ఎంపీడీవో పీఎస్ఎస్ శ్రీనివాస్ స్థలాన్ని పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పూర్తిగా అధ్యాయనం చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు.

జీడి మామిడి రైతుల బీమా

నమోదు గడువు పొడిగింపు


కొవ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీడి మామిడి రైతులు బీమా నమోదు చేసుకోవడానికి ఈ నెల 22వరకు గడువు పొడిగించినట్టు కొవ్వూరు ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. వాతావరణం ఆధారంగా పటం నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జీడిమామిడి రైతులకు బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఎకరాకు రూ.1500 ప్రీమియం చెల్లించాలన్నారు. బీమా నమోదు చేసుకున్న రైతుల సంఖ్య తక్కువగా ఉన్నందున ప్రభుత్వం ఈ నెల 22 వరకు గడువును పొడిగించిందన్నారు. రైతులు ఈకేవైసీలో నమోదు చేసుకున్న విస్తీర్ణానికి బీమా మొత్తం చెల్లించాలన్నారు. వివరాలకు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించాలన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నిడదవోలు వైసీపీ కౌన్సిలర్లు


వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్ సత్యనారాయణ

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీ విభేదాలు తాడేపల్లి కార్యాలయానికి చేరాయి. ప్రస్తుత వైసీపీ కౌన్సిలర్లు మంగళవారం మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిశారు. కౌన్సిలర్ కేవీ సత్యనారాయణ కౌన్సిల్ రాజకీయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమయం చూసి అడుగు వేద్దామని సలహా ఇచ్చినట్టు సమాచారం. వీరి వెంట రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులున్నారు.

పారదర్శకంగా గృహాల సర్వే



గోపాలపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస యోజనలో మంజూరైన గృహాలకు సంబంధించిన సర్వేను పారదర్శకంగా చేపడుతున్నట్టు గృహ నిర్మాణ శాఖ డీఈ రాజశేఖర్ తెలిపారు. చిట్యాలలో ప్రధాన మంత్రి అవాస్ యోజనలో మంజూరైన గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. నియోజకవర్గంలో మొత్తం 5865 గృహాలు మంజూరు కాగా 3వేల గృహాలు పూర్తయ్యాయని, 1800 నిర్మాణ దశలో ఉన్నాయని, వెయ్యి గృహాలు ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు. డీఈ వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

మహిళలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలి

కొవ్వూరు ఎంపీడీవో సుశీల
జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

కొవ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు సర్వతోముఖాభివృద్ధి సాధించి స్వయం నిర్ణయాత్మక శక్తిని కలిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని కొవ్వూరు ఎంపీడీవో కె.సుశీల అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవం, మహిళా సాధికారత కార్యక్రమం నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఎంపీడీవోతోపాటు ఎంఈవో జె.కెంపురత్నం ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంబన కలిగి ఉన్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు జరిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జీవీవీఎన్ త్రినాథ్, పాఠకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ గుదే సుశీల పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళాభ్యున్నతికి ఇందిరా గాంధీ చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. మహిళాభ్యున్నతికి ఇందిరా గాంధీ కృషి అంశంపై విద్యార్థులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఏవీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక శాఖా గ్రంథాలయం లో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జాతీ య మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎం ఈవో శారదా జ్యోత్స్న, రిటైర్డ్ లెక్చరర్ కోట రామప్రసాద్ ఇందిరాగాంధీ జీవిత విశేషాలను వివరించారు. తొలుత ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు జరిపారు. కార్యక్రమంలో లైబ్రరీ కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాస్, గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బోయపాటి రామలక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఇంది రగాంధీ జయంతిని మహిళ దినోత్సవంగా జరుపుకుని ఆమెకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్‌ఐ కె.నరేంద్ర మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అవసరమైతే పోలీసుల సహాయం అన్ని వేళల ఉంటుందన్నారు. ఎవరైనా వేధిస్తే తల్లిదండ్రులకు తర్వాత పోలీసులకు తెలియజేయాలన్నారు. కోడి నాగేశ్వరరావు, జేవీ శ్రీనివాసరావు, సత్తిరాజు, వెత్సా గంగాధరం పాల్గొన్నారు. చంద్రవరం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ బాలికలు అపాయంలో ఉన్నా, అనారోగ్యంతో ఉన్నా ఫోన్‌నెంబర్లు 100, 108, 104లకు కాల్ చేయాలని చెప్పారు. గ్రంథాలయాధికారులు జి.శ్రీనివాసరావు, కె.సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

దేవరపల్లి: యర్నగూడెం శాఖా గ్రంథాలయం లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. గ్రంథాలయా ధికారి జి.అనీత మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా భూసంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణ, పేద లకు ఇళ్లస్థలాలు అందించిన ఘనత ఇందిరాగాం ధీకే దక్కుతుందన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో యర్నగూడెం కళాశాల ప్రిన్సిపాల్ దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉండ్రాజవరంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



కొవ్వూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల


నల్లజర్లలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుశీల


చాగల్లులో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్ర

ప్రతి గ్రామంలో పంట కోత ప్రయోగం

జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు


రావిమెట్లలో కోసిన పంటను పరిశీలిస్తున్న మాధవరావు

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి రెవెన్యూ గ్రామంలోను పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా పంట కోత ప్రయోగాన్ని నిర్వహించి పంట దిగుబడిని అంచనా వేస్తున్నట్టు జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. మంగళవారం నిడదవోలు మండలం రావిమెట్ల గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంటకోత ప్రయోగం నిర్వహించారు. మాధవరావు మాట్లాడుతూ ఎంపిక చేసిన పొలాల్లో 5 చదరపు మీటర్ల వైశాల్యంలో పంటను కోసి దిగుబడిని అంచనా వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో జి.సత్యనారాయణ, ఎం.రాజు, బయ్యే ప్రశాంత్, వై.శివకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

బ్యాంకుల జాతీయకరణ ఘనత ఇందిరమ్మదే

» కాంగ్రెస్ పార్టీ నాయకులు » ఘనంగా మాజీ ప్రధానమంత్రి జయంతి


నిడదవోలులో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో బహుళార్థసాధక ప్రాజెక్టులు, డ్యామ్‌లు, బ్యాంకుల జాతీయకరణ వంటి కార్యక్రమాలను చేపట్టిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే చెందుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కారింకి వెంకటేశ్వరరావు, పట్టణాధ్యక్షుడు మేడవరపు భద్రందొర, చిన్నం మురళీకృష్ణ, హీరాలాల్, సత్యనారాయణ, జహీ, రమేష్ పాల్గొన్నారు

చాగల్లు: చాగల్లులోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాలకుర్తి ప్రభాకరచౌదరి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె దేశ కోసం, పేదల సంక్షేమం కోసం చేసిన సేవలను కొనియాడారు. అరుంధతీయ రేడియో రూమ్ వద్ద జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా సుబ్బారావు, గెల్లా భాస్కరరావు తదితరులు పాల్గొని ఇందిరమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్ పటిష్టం అవుతుందన్నారు.


చాగల్లులో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పనిగంటలు పెంచితే విద్యార్థులపై ఒత్తిడి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరగబోయే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులంతా నడుంకట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అన్నారు. రాజమహేంద్రవరం యూటీఎఫ్ హోంలో మంగళవారం జరిగిన జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జయకర్ మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకను విజయంతం చేద్దామన్నారు. ఇటీవల ప్రభుత్వం పాఠశాల పనివేళలు ఒక గంట పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందని, నియమిత పనిగంటలు మించి విద్యార్థులకు బోధన సాగిస్తే పిల్లలు ఒత్తిడికి గురవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అసోసియేట్ విజయగౌరీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ఉండ్రాజవరం, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వేలివెన్ను గ్రామం లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. ఉపసర్పంచ్, టీడీపీ నాయకుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం 97వ బూత్‌లో ఇంటింటికీ వెళ్లి పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. గ్రామంలో జీవిత సభ్యత్వముతోపాటు ఇప్పటి వరకు 1210 సభ్యత్వాలు నమోదు చేసినట్టు శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు చురుగ్గా జరుగుతోందని అన్నారు.

మరుగుదొడ్ల దినోత్సవం



. దేవరపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ టాయిలెట్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా దేవరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈవోపీఆర్డీ రాజారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్ల శుభ్రతను పాటించాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం టాయిలెట్‌లు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి పాల్గొన్నారు.

డీఎస్సీపై ఆందోళన వద్దు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీపై అభ్యర్థులెవరు ఆందోళన చెందవద్దని టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దారా ఏసురత్నం అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఐదేళ్లుగా భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థను మంత్రి నారా లోకేశ్ గాడిలో పెడుతున్నారన్నారు.